జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

సంపుటి: 49 సంచిక: 13 విజయవాడ 5-11-2016 పేజీలు: 8 వెల: రు 5.00

జనశక్తి సంచికను ఆన్‌లైన్ ద్వారా చదువుకొనుటకు

www.janasakthionline.com

వెబ్‌లింక్‌ను సందర్శించండి

జనశక్తిలో ప్రచురించుటకు రాసిన వ్యాసాలు, రిపోర్టులను

janasakthi1963@gmail.com

అనే ఈ-మెయిల్‌కు పంపగలరు

నదీ జలాల వివాదాల సెగలతో చలికాగుతున్న పాలకులు

కృష్ణాజలాల వివాద పరిష్కారానికి బచావత్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పు 2000 సంవత్సరంతో ముగిసింది. తర్వాత 2005లో బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌ను నియమించారు. ఇది 2014 నాటికి తీర్పునిచ్చింది. పంపకాల్లో అన్యాయం జరిగిందంటూ రాష్ట్రాలు సుప్రీంకోర్టు గడపనెక్కడంతో ట్రిబ్యునల్ తీర్పు అమలుకాకుండా ఉండిపోయింది. ఈలోగా ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి రెండు రాష్ట్రాలేర్పడ్డాయి. దీనితో ఆంధ్రప్రదేశ్, తెలంగాణాల మధ్య ట్రిబ్యునల్ తీర్పు వల్ల అన్యాయం జరిగిందన్న వాదనలు సాగుతున్నాయి. సమస్యను పరిష్కరించుకునే దిశగా చర్యలు చేపట్టే బదులుగా, ప్రాంతీయ వైషమ్యాలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని పాలకవర్గ పార్టీలు చూస్తున్నాయని మరోసారి బట్టబయలైంది.

బచావత్ ట్రిబ్యునల్ గడువు ముగుస్తుండటంతో కృష్ణానదిపై మూడు రాష్ట్రాలూ అనేక ప్రాజెక్టుల నిర్మాణాన్ని చేపట్టాయి. దీనితో బ్రిజేష్ ట్రిబ్యునల్ ఈ ప్రాజెక్టులకు నీటిని కేటాయించింది. ఒక రాష్ట్రానికి కొంత తగ్గటమో, పెరగటమో జరిగినా సర్దుబాటు చేసుకోవచ్చు. కాగా మూడు రాష్ట్రాలూ యాగీ చేసి సుప్రీంకోర్టుకు వివాదాన్ని చేర్చాయి. దీనితో గత ట్రిబ్యునల్ గడువు ముగిసి 16 ఏళ్ళయినా, రెండవ ట్రిబ్యునల్ తీర్పువచ్చినా, అమలుజరగని స్థితిని కల్పించారు.

సుప్రీంకోర్టు జోక్యం చేసుకున్నప్పటికీ, ట్రిబ్యునల్ చేసిన ప్రాజెక్టులవారీ కేటాయింపుల్లో పెద్ద తేడాలేవీ ఉండబోవని చెప్పడానికి న్యాయకోవిదుల అవసరమేమీ లేదు; సామాన్యులకు కూడా అర్థమయ్యే విషయమే. ఇక సుప్రీంకోర్టు చెయ్యగలిగింది, ఈ కేటాయింపులు సక్రమంగా అమలు జరిగేందుకు తగిన చట్రాన్ని రూపొందించటమే. కావేరీజలాల వివాద సందర్భంగా కావేరీ జలాల ప్రాధికార సంస్థను ఏర్పాటు చెయ్యమన్న 2007నాటి సుప్రీంకోర్టు ఆదేశం ఇలా జరిగిందే. ఈనాటికీ దాని నేర్పాటు చెయ్యకుండా పాలకపార్టీలు సమస్యను సాగలాగటంతో గత నెలలో కావేరీ రక్తసిక్తమైంది.

కృష్ణానది విషయంలో సుప్రీంకోర్టుకు ఇది కూడా మిగలలేదు. మూడు రాష్ట్రాల మంత్రులు, కేంద్రమంత్రితో రాజకీయస్థాయిలో కమిటీనీ, మూడు రాష్ట్రాల, కేంద్ర సాంకేతిక నిపుణులతో నిర్వహణా కమిటీతోనూ కృష్ణా, గోదావరి నదులకు బోర్డులు ఏర్పాటుచేయాలని ట్రిబ్యునల్ తీర్పునిచ్చింది. దీనినమలు జరిపితే వివాదాలు లేకుండా నీటి వినియోగం, పంపకం సాగే అవకాశం వుంది.

కానీ సమస్య సామరస్యంగా పరిష్కారం కావటాన్ని పాలకవర్గపార్టీలు కోరుకోవటంలేదు. సమస్యను జటిలం చెయ్యటానికే పూనుకున్నారు. ట్రిబ్యునల్ తీర్పులోని కీలకాంశాన్ని (బోర్డుల ఏర్పాటు) తుంగలో తొక్కేందుకు పూనుకున్నారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలు ఏర్పడటంతో, ట్రిబ్యునల్ సూచించిన నదీ బోర్డులను నాలుగు రాష్ట్రాలతో (మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణా, ఆంధ్రప్రదేశ్) ఏర్పాటు చెయ్యాలన్నది సామాన్యులకైనా అర్థమౌతుంది. కానీ కేంద్రంలోని నాటి యుపిఏ ప్రభుత్వం విభజన చట్టంలో రెండు రాష్ట్రాలకే నదీ బోర్డులు ఏర్పాటుచేస్తూనూ, ఇప్పటికే ప్రాజెక్టులవారీగా పంపకం జరిగినా మళ్ళీ ఆంధ్రా, తెలంగాణాల మధ్య పంపకం చెయ్యమంటూ బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కే అప్పగించటంతో నాలుగు రాష్ట్రాల ఉమ్మడి నదీ బోర్డు ఏర్పాటును తొక్కివేసింది.

విభజన చట్టం తప్పుల తడకంటూ పార్లమెంటు సాక్షిగా వీరంగం వేసిన బిజెపి, అధికారంలోకి రాగానే, లోపాలను సరిదిద్దే బదులుగా, రెండు రాష్ట్రాలకి నదీబోర్డులను నియమించింది. ట్రిబ్యునల్ ముందు ఈ రెండు రాష్ట్రాల వివాదాన్ని పరిష్కరించమని చెప్పింది.

తమ మోసాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఆనాటి యుపిఏ ప్రభుత్వం నదీజలాల వివాదాల పరిష్కారానికి శాశ్వత ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తానంటూ ప్రచారం చేసింది. కాగా నేడు బిజెపి ప్రభుత్వం నదీ జలాల వివాదాల పరిష్కారానికి అన్ని అంశాలు కలిగిన ఒక సమగ్ర చట్టం రూపకల్పన ప్రారంభించానంటూ ప్రచారం చేస్తున్నది. ఏది ఏమైనా కృష్ణానదీ పరీవాహక ప్రాంతంలోని నాలుగు రాష్ట్రాల మధ్య వివాదాలు కొనసాగేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిందన్నది స్పష్టం.

నాలుగు రాష్ట్రాలకూ కలిపి నదీబోర్డులు నియమించాలన్న తీర్పు ప్రక్కనపెట్టారు. పొడిగించిన ట్రిబ్యునల్ నాలుగు రాష్ట్రాల మధ్య నీటి పంపకం చెయ్యాలని, దిగువ రాష్ట్రాలైన తెలంగాణా, ఆంధ్రాలూ; ఆ రెంటి మధ్య చెయ్యాలనీ, తమను చేర్చవద్దని ఎగువ రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్రలూ వాదనలు సాగించాయి. ఆవిధంగా క్రింది రాష్ట్రాలకు అన్యాయం జరిగిందన్న, పై రాష్ట్రాలకు అధిక లబ్ధి చేకూరిందన్న భావనలు నాలుగు రాష్ట్రాల్లోనూ వ్యాప్తిచేసి ప్రాంతీయ వైమనస్యాలను పాలకవర్గ పార్టీలు పెంచుతున్నాయి. ఇరు తెలుగు రాష్ట్రాలలో ఈ పరిస్థితి మరింత తీవ్రస్థాయికి చేరింది.

సాగుభూములకు నీరు కావాలన్నది రైతాంగపు ప్రజాస్వామిక ఆకాంక్ష. దానిని తీర్చటం దోపిడీ పాలకవర్గాల లక్ష్యం కాదు. నీటి పారుదల కల్పిస్తామంటూ ఆశలు కొలిపే ప్రకటనలు చేసి పబ్బం గడుపుకుంటూ వచ్చాయి. టిడిపి ప్రభుత్వ అధినేత చంద్రబాబునాయుడు కూడా ఇవే ప్రకటనలతో కాలం గలుపుతున్నాడు. పోలవరం డ్యాము డిజైనులను పరీక్షించటానికి ఇంకా సంవత్సరకాలం పట్టనుండగా, రెండేళ్ళలో ప్రాజెక్టు పూర్తిచేస్తానంటూ పదే పదే ప్రకటిస్తున్నాడు. కేంద్ర జలవనరుల సంఘం నుండి అనుమతులు లేకుండానే ఇప్పటికే 6 వేల కోట్లకుపైగా ఖర్చుచేసి ఇంకా 40 వేల కోట్లు అవసరమంటూ కేంద్రానికి విజ్ఞప్తులు చేస్తున్నాడు.

తెలంగాణా ముఖ్యమంత్రి కెసిఆర్ కూడా ఇలాగే వ్యవహరిస్తున్నాడు. ప్రాణహిత – చేవెళ్ళ, మిషన్ కాకతీయ అంటూ నీటి ప్రాజెక్టుల ప్రకటనలు సాగుతున్నాయి తప్ప, వందల కోట్లు ఖర్చవుతున్నట్లు ప్రకటనలు తప్ప ప్రజల సాగునీటి ఆకాంక్షలు తీరుతాయన్న ఆశలు కనుచూపుమేరలో కూడా లేవు.

పొరుగు రాష్ట్రం వైఖరివల్లే, మోకాలడ్డటంవల్లే నీటి ప్రాజెక్టులకు ఆటంకాలు ఏర్పడుతున్నాయంటూ పరస్పర ఆరోపణలను ఇరు తెలుగురాష్ట్రాల అధినేతలు సాగిస్తున్నారు. ప్రాంతీయ వైమనస్యాలను మరల రగిల్చి తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు పూనుకున్నారు.

గతేడాది శ్రీశైలంలోని నీటిని ఎలా వినియోగించాలో నదీబోర్డు నిర్ణయించింది. అయినా దానిని పట్టించుకోకుండా ఇరు రాష్ట్రాలూ కరెంటు ఉత్పత్తికి నీటిని దుర్వినియోగపరిచాయి; **(తరువాయి 2వ పేజీలో)**

పాలకులు – ప్రజాస్వామ్యం

పొద్దున లేచింది మొదలు ప్రజాస్వామ్యం గురించి పారాయణచేసే పాలకులు, ప్రభుత్వాల అధినేతలు – నిజమైన అర్థంలో ప్రజాస్వామ్య స్ఫూర్తిని పిసరంతైనా ఆచరణలో పెట్టటానికి శ్రద్ధ చూపకపోగా, తాము చేపట్టే విధానాల, చర్యల సమగ్రసారమే ప్రజాస్వామ్య మన్నట్లుగా ప్రజలను, మధ్య తరగతి మేధావులను వంచింప జూస్తున్నారు.

మధ్య యుగాలనాటి ఫ్యూడల్, భూస్వామ్య, రాచరిక బంధనాల విముక్తికోసం బాధిత పీడిత ప్రజానీకం సాగించిన సంఘర్షణల్లో ఆధునిక ప్రజాస్వామ్య భావన ఉద్భవించిందనే లోతైన అవగాహన్నుగానీ; 'ప్రజలచేత – ప్రజలకొరకు' సాగించే – ప్రజల యొక్క పాలన అనే కనీసపాటి ప్రజాస్వామ్య దృక్పథాన్ని కానీ – పాలకులు ఏమాత్రం లక్ష్యపెట్టకపోగా, దానిని ఉద్దేశ్యపూరితంగా విస్మరిస్తున్నారు. ప్రజా రాశులను వారు సామాజిక సమీకరణాల ఓటు బ్యాంకులుగా చూస్తూ, ప్రజాస్వామ్యమంటే, ఓట్లు – ఎన్నికలుగా దిగజార్చారు.

పాలకులు – తాము ప్రభుత్వాధికారంలోకి రావటంకోసం వివిధ ప్రజా సమూహాలకు రాయితీలు, తాయిలాలు, పథకాలు ప్రకటించీ, వారిని ప్రలోభాలకు గురిచేసీ; కుల – మత – ప్రాంతీయ భావోద్వేగాలను ప్రేరేపించీ; డబ్బు – మద్యం – అధికారం – గూండాలు – పోలీసుల వంటి మార్గాలనన్నీ ప్రయోగించీ – వందమందికిగానూ పోలైన 50 ఓట్లలో 26 ఓట్లు పొందినవారు ప్రభుత్వపాలనాధికారాన్ని కైవసం చేసుకోవటాన్నే ప్రజాస్వామ్యంగా అపహాస్యం చేస్తున్నారు.

ఏ పాలకపార్టీ ఎన్నికలలో గెలిచి అధికారంలోకి వచ్చినా భూస్వామ్య, సామ్రాజ్యవాద ప్రయోజనాలకు ఊడిగంచేసే విధానాలనే అమలుచేస్తున్నాయి. అశేష పీడిత, శ్రామిక ప్రజానీకాన్ని దుర్భర దారిద్ర్యానికి గురిచేస్తూ, పిడికెడుమందిగా వున్న ధనికస్వాములకు దండిగా ఆదాయాలు సమకూర్చే ఈ క్రమంలో, అధికార రథచక్రాల నడుమన నలిగి ఛిద్రమైపోతున్న అభాగ్య ప్రజానీకపు గోడును గద్దెపై కూర్చున్నవారెవరూ ఆలకించటంలేదు. పైగా తమ వేదనలను, సమస్యలను నివేదించుకునే ప్రజల ప్రయత్నాలను గూడా పోలీసులను ప్రయోగించి పాలకులు కర్కశంగా అణచివేస్తున్నారు. అంతేతప్ప బాధిత ప్రజల సమస్యలను సావధానంగా విని, వారిని ఒప్పించి, సమస్యలను పరిష్కరించి, వారి మనసులను గెలవగలగటం దోపిడీ పాలకులను అసాధ్యమని స్పష్టమౌతోంది. ఇటీవలి కాలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పోలీసులపై మరింతగా ఆధారపడుతూ దూకుడుగా ముందుకు సాగుతుండటాన్ని గమనించగలం.

పశ్చిమగోదావరిజిల్లా – భీమవరం మండలం, తుందుర్రులో పచ్చని పంటపొలాల్ని సేకరించి గోదావరి ఆక్వాఫుడ్ పరిశ్రమ నిర్మాణాన్ని చేపట్టారు. దీని ఫలితంగా పచ్చని ఆ ప్రాంతమంతా తీవ్ర కాలుష్యం బారిన పడుతుంది. పరిసరాల్లోని 40 గ్రామాలకు నీరందించే గొంతేరు డ్రెయిన్ కలుషితమౌతుంది. కనుక ఈ పరిశ్రమ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని, ఈ పరిశ్రమను ఇక్కడ నుండి తరలించాలని డిమాండ్ చేస్తూ గత కొంతకాలంగా సంబంధిత గ్రామాల ప్రజానీకం ఆందోళన సాగిస్తున్నారు. ప్రజా ఆందోళనను ప్రభుత్వం అణచివేత ద్వారా గొంతు నొక్కివేయటానికే పూనుకొని వ్యవహరిస్తోంది. ఈ ప్రాంతంలో పోలీసులు 40 రోజులకు పైగా 144వ సెక్షన్ను అమలుచేస్తున్నారు. ఆధార్‌కార్డు లేకుండా గ్రామంలోకి ఎవరినీ అనుమతించటంలేదు. ఆ గ్రామాలలోని 300 మందిపై ఇప్పటికే పలు అక్రమకేసులు బనాయించారు.

కడపజిల్లా – మైదుకూరు మండలం, గొల్లపల్లిలో ఏసిసి యాజమాన్యంలో ఇంటిగ్రేటెడ్ సిమెంట్ కాంప్లెక్సు నిర్మాణం కోసం యాజమాన్యం పది సంవత్సరాలక్రితమే నామమాత్రపు ధర చెల్లించి 3,600 ఎకరాల భూములను రైతుల నుండి సేకరించింది. 5 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో సిమెంట్ పరిశ్రమ నెలకొల్పుతామని ప్రకటించినా ఇంతవరకూ అందుకు పూనుకోకపోవటంతో భూములు కోల్పోయిన రైతులలో ఆందోళన పెరిగింది. దీనిని దృష్టిలో వుంచుకొని 20-10-16న ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించింది. వెయ్యిమంది సాయుధ పోలీసులను ప్రభుత్వం ఈ సందర్భంగా మోహరించింది. చుట్టుప్రక్కల ప్రాంతాలను పోలీసులు దిగ్బంధం చేశారు. పోలీసు చెక్‌పోస్టులు పెట్టారు. రోడ్లపై ప్రజలను తిరగనియ్యలేదు. ఆర్‌టిసి బస్సులను సైతం దోవ మళ్ళించారు. పౌరహక్కుల, ప్రజాసంఘాల నాయకులను, ప్రత్యర్థి రాజకీయపార్టీల నేతలను ముందురోజే అదుపులోకి తీసుకున్నారు.

తూర్పుగోదావరిజిల్లా – తొండంగి మండలంలో దివీస్ యాజమాన్యం నిర్మించ తలపెట్టిన కాలుష్యకారక, ప్రమాదకర ఔషధ పరిశ్రమకు వ్యతిరేకంగా పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన సాగిస్తున్నారు. ఈ పరిశ్రమ నుండి వెలువడే వ్యర్థాలతో పరిసరాలన్నీ, తీవ్ర జల, వాయు కాలుష్యానికి గురవుతాయి. వాతావరణంలో ఉష్ణతాపం పెరుగుతుంది. రసాయన వ్యర్థాలను సముద్రంలో కలపటం వలన మత్స్యసంపదకు నష్టం వాటిల్లుతుంది. కనుక ఈ ప్రాంత ప్రజలు దివీస్ ఔషధ పరిశ్రమను వ్యతిరేకిస్తుంటే, వారి సమస్యలను ఆలకించి, వారిని సంతృప్తపరిచే చర్యలకు బదులుగా పోలీసు అణచివేతను ప్రయోగిస్తున్నారు. ఈ ప్రాంతంలో 144 సెక్షను విధించారు. 20-10-16న ఈ ప్రాంత పరిశీలనకు వచ్చిన వివిధ ప్రజా, మహిళాసంఘాల నేతలను అరెస్టు చేశారు.

అనంతపురంజిల్లా – యస్‌పికుంట మండల కేంద్రంలో 1500 మెగావాట్ల సామర్థ్యం కల్గిన సోలార్ ప్లాంట్ నిర్మాణం కోసం 8 వేల ఎకరాల భూములను రెండు సంవత్సరాల క్రితమే సేకరించారు. అయితే, ఈనాటికీ భూ యజమానులకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించలేదు. భూములను కోల్పోయిన రైతులందరికీ పూర్తిస్థాయిలో పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసిన వామపక్ష పార్టీల నాయకులు, **(తరువాయి 5వ పేజీలో)**

ఇసుక అక్రమ రవాణాతో జేబులు నింపుకొంటున్న అధికార - ప్రతిపక్షాలు

ప్రకృతి ప్రసాదించిన సహజ ఖనిజ సంపదల్లో ఇసుక ఒకటి. నేటి నాగరిక ప్రపంచంలో ఇసుక అవసరం ఎంతగానో వుంది. రోడ్లు, భవనాలు, అపార్ట్‌మెంట్లు, ప్రాజెక్టుల నిర్మాణం ఇసుక లేకుండా సాధ్యంకాదు. ఇతర ఖనిజాల వలనే ఇసుకపైనా దళారుల, పెత్తందార్ల, ప్రధాన రాజకీయ పార్టీ యొక్క ఆధిపత్యం కొనసాగుతున్నది. వీరి కనుసన్నల్లో ఇసుక అక్రమ రవాణా పెద్దఎత్తున కొనసాగుతున్నది. కోట్లాది రూపాయలు వీరి జేబుల్లోకి చేరుతున్నాయి. పరస్పర విమర్శలతో నిత్యం తిట్టుకొనే అధికార - ప్రతిపక్ష పార్టీలకు చెందినవారు అనేక జిల్లాల్లో కుమ్మక్కు అయి ఇసుక దందా పెద్దఎత్తున కొనసాగిస్తున్నారు. పార్టీలు వేరైనా దోచుకోవటంలో వీరి స్వభావం ఒకటేనన్న వాస్తవం వెల్లడైంది.

రాష్ట్రంలోని అనేక రేవుల్లో వరదనీటి ప్రవాహానికి ఇసుక మేటలు ఏర్పడతాయి. వరదల తాకిడికి కరకట్టలు కోతలకు గురికాకుండా ఇసుకమేటలు కాపాడతాయి. భూమిలోకి నీరు ఇంకటానికి ఇసుక ప్రధానపాత్ర పోషిస్తుంది. వరదలు, వర్షాల నీరు భూమిలో ఇంకటానికి ఇసుక నేలలు కీలకపాత్ర పోషిస్తాయి. భూగర్భ జలాల పెరుగుదలకు తోడ్పడతాయి. ఇంత ప్రాధాన్యతగల ఇసుక, మాఫియాల గుప్పెట్లోకి వెళ్లింది.

1960 వరకు ఇసుక వాడకం చాలా తక్కువగా వుండేది. ఆ తర్వాత క్రమంగా దాని అవసరం పెరుగుతూ వచ్చింది. గ్రామాల పరిధిలో ఇండ్ల నిర్మాణానికి ఎటువంటి రుసుం లేకుండా ఇసుక ఉపయోగించుకొనేవారు. గ్రామ పంచాయితీల ఆదాయం పెంచే పేరుతో ఇసుక వాడకంపై రుసుం విధించేహక్కు మొదట పంచాయితీలకు ఇచ్చారు. ఆ తర్వాత పంచాయితీల పరిధిలో వేలం పాటలు నిర్వహించారు. క్రమంగా వేలంపాటలద్వారా వచ్చే సొమ్ములో వాటాల విధానం ప్రవేశపెట్టారు. దాని ప్రకారం ఆదాయంలో 65 శాతం పంచాయితీలకు, 30 శాతం మండలాలకు, 5 శాతం జిల్లా పరిషత్‌లకు కేటాయింపులు వుండేవి. ప్రైవేటీకరణ విధానాల ఫలితంగా పాటలద్వారా వచ్చే ఆదాయాన్ని మైనింగ్ శాఖకు 15శాతం, మండల పరిషత్‌కి 50%, జడ్.పి., పంచాయితీలకు 35 శాతం కేటాయించారు. ఇది పంచాయితీల హక్కును, ఆదాయాన్ని హరించటమే. ఇసుక రీచ్‌ల వేలంలోనూ మాఫియా ఆధిపత్యం కొనసాగుతున్నది. రాష్ట్రంలో 432 ప్రాంతాల్లో ఇసుక లభ్యత వున్నా 132 ప్రాంతాల్లోనే ప్రభుత్వం వేలం పాటలు నిర్వహించింది. ప్రభుత్వంలో పలుకుబడి గలవారు, అధికారపార్టీ నాయకులు, ఎమ్.ఎల్.ఏ.లు అనేకచోట్ల వేలంపాటలు జరక్కుండా చేసి, ఆ ప్రాంతాల్లోని ఇసుకను అనధికారంగా విక్రయించి పెద్దమొత్తంలో సొమ్ము చేసుకొన్నారు. కృష్ణాజిల్లాలో 72 ఇసుక క్వారీలు వుంటే నాలుగిటికే పాటలు నిర్వహించబడ్డాయంటే ఎంత పెద్దఎత్తున లాబీ జరిగిందో అర్థమౌతుంది.

ఇసుక త్రవ్వకాల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం రెండు మీటర్ల లోతుకి మించి త్రవ్వగూడదు. అంతకు మించి త్రవ్వితే భూగర్భ జలాలు తగ్గిపోతాయి. 2002 ఏ.పి. వాల్టా చట్టప్రకారం ఇసుక త్రవ్వకానికి యంత్రాలను ఉపయోగించగూడదు. దీన్ని ఇసుక మాఫియా ఉల్లంఘించి ప్రొక్లెయినర్లను యధేచ్ఛగా వాడటమే కాకుండా నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ లోతులో ఇసుకను త్రవ్వారు. తద్వారా పెద్దఎత్తున సొమ్ము చేసుకోవటమే కాకుండా కూలీలకు పనులు లేకుండా చేశారు. వీరి అక్రమ త్రవ్వకాలకు అధికారులు ఏమాత్రం అడ్డుపడ్డా వారిపై దాడులు చేయటం, బదిలీ చేయించటం చేశారు.

వేలంద్వారా ఇసుక రీచ్‌లు చేజిక్కించుకొన్న సిండికేట్ మాఫియా, సామాన్యుడికి అందని విధంగా ఇసుక ధరను నిర్ణయించారు. గృహ నిర్మాణానికి ఇసుక తీసుకెళ్ళటానికే భయపడే పరిస్థితి ఏర్పడింది. అందుకోసం ఎక్కువ ఖర్చు చేయాల్సిన పరిస్థితి వచ్చి ఇసుక మాఫియా అక్రమాలపై చర్యలు తీసుకొనని పాలకులపైనా ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది.

అక్రమాలకు పాల్పడే వారిపైనా, అవినీతిపరులపైనా ఉక్కుపాదం మోపుతానని మాటలు చెప్పిన చంద్రబాబు, అందుకు విరుద్ధంగా వ్యవహరించాడు. తన అక్రమ ఇసుక త్రవ్వకాలను అడ్డుకొందనే కోపంతో ఆయన పార్టీ ఎమ్.ఎల్.ఏ. తాశీల్దార్ వనజాక్షిపై దాడిచేస్తే ఆయనపై ఎటువంటి చర్యలు తీసుకోకపోగా, అండగా నిలిచి, తాశీల్దారుని చివాట్లు పెట్టడం జరిగింది. ఇదేనా అవినీతిపై ఆయన ఉక్కుపాదం?! ఇదేవిధంగా అనేక చోట్ల తన అనుయాయులను, ఎమ్ఎల్ఏలను కాపాడుతూ వచ్చాడు.

ఇసుక అందని వస్తువుగా మారటం, దాని ధర వణుకు పుట్టించటం, ఇసుక విక్రయాల్లో అవినీతి, అక్రమాలు పెద్దఎత్తున బయటపడటం, వారి ఎడల ప్రభుత్వం అనుసరించిన విధానాలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఏర్పడింది. ఈ అసంతృప్తిని ప్రక్కదారి పట్టించేందుకు, ఇసుక పాటలను రద్దుచేస్తున్నానని, ఇసుకను ఉచితంగా తీసుకొని వెళ్లవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. 'ఇసుక రీచ్‌ల ప్రాంతంలోని గ్రామాలవారే అవసరంమేరకు ఇసుకని తీసుకెళ్లాలి. ఉచిత ఇసుకవలన ప్రభుత్వానికి ఆదాయం తగ్గినా సామాన్యుడికి ఎంతో మేలు జరుగుతుందనే అందుకు నిర్ణయం తీసుకొన్నాన'ని చంద్రబాబు గొప్పగా చెప్పుకొన్నాడు. సామాన్య ప్రజలకు కొద్ది మోతాదులోనే ఇసుక అవసరం వుంటుంది. రియల్ ఎస్టేట్‌దారులు, బిల్డర్లు, సంపన్నవర్గాలే పెద్దమొత్తంలో ఇసుకను వినియోగిస్తారు. ఉచిత ఇసుక విధానం వారికే ఎక్కువ ప్రయోజనకరంగా వుంటుంది. చంద్రబాబు ఉచిత ఇసుక విధానంలో ఈ అంశమే ఇమిడి వుంది.

ప్రజల పేరుతో ప్రభుత్వం చేపట్టే ఏ చర్యకూడా ఆచరణలో వారికి ఉపయోగపడటంలేదు. సంపన్న వర్గాలకు, దళారులకు, అవినీతిపరులకే ఉపయోగ పడుతున్నది. ఉచిత ఇసుక విధానం అందులో ఒకటి. ఇది ఇసుక మాఫియాలకు, వారితో కుమ్మక్కు అయిన దళారులు, పాలకపార్టీలకు చెందిన వివిధస్థాయి నాయకులు పెద్దఎత్తున దందాచేయటానికి చక్కటి మార్గమైంది. పాలకపార్టీలకు చెందినవారు వారి వారి ప్రాంతాల్లో వ్యక్తిగతంగా, ఉమ్మడిగా దీన్ని కొనసాగిస్తున్నారు. ఉచిత ఇసుకని చెప్పినా సామాన్య ప్రజలు వీరికి డబ్బులు ముట్టచెప్పకుండా ఇసుక తీసుకెళ్ళే పరిస్థితి లేదు. అలా ప్రయత్నం చేసేవారికి అనేక అడ్డంకులు కల్పిస్తున్నారు. లారీలు, కూలీలు దొరక్కుండా చేస్తున్నారు.

మాఫియాలు, పాలక-ప్రతిపక్ష పార్టీల నాయకులు కుమ్మక్కు కావటంతో అనేక జిల్లాల్లో ఇసుక అక్రమ రవాణా వందలకోట్లలో జరుగుతున్నది.

గుంటూరుజిల్లా నుండి ప్రతిరోజు 50 లక్షల రూపాయల విలువచేసే ఇసుకను అక్రమంగా హైద్రాబాద్‌కి తరలిస్తున్నారు. జిల్లాలో కోసూరు, పెనుమాక, కొల్లిపర, కొల్లూరు, రేపల్లె ప్రాంతాల్లో అక్రమ ఇసుక త్రవ్వకాలు అడ్డులేకుండా సాగుతున్నాయి. ఇసుక క్వారీల వద్ద ఎమ్.ఎల్.ఏ. అనుచరులు మకాంవేసి పెద్దఎత్తున డబ్బులు వసూలు చేస్తున్నారు. ఆరుటైర్ల లారీకి 3 వేలు, పది టైర్ల లారీకి 5వేలు వసూలు చేస్తూ ఇసుక లోడింగ్ చేయిస్తున్నారు. ఇందుకు భారీయంత్రాలను ఉపయోగిస్తున్నారు. **దాచేపల్లి** మండలం పొందుగుల మీదుగా పలు ప్రాంతాలనుండి ఇసుకను హైద్రాబాద్‌కి తరలిస్తున్నారు. రోజుకి 200 లారీల ఇసుక హైద్రాబాద్‌కి తరలిపోతున్నది. మైనింగ్, రెవిన్యూ, పోలీసు అధికారులకు భారీగా ముడుపులు అందుతుండటంతో లారీల వైపు ఎవరూ కన్నెత్తి చూడటంలేదు. **విశాఖజిల్లాలో** అధికార - ప్రతిపక్ష నాయకులు ఏకమై పెద్దఎత్తున అక్రమ ఇసుక త్రవ్వకాలకు పాల్పడుతున్నారు. నర్సిపట్నంలోని రాహనదిలో ఉత్తరవాహిని, దుగ్గాడ, మాకవరంపాలెం మండలంలో సర్పానదిలో కొండల అగ్రహారం, గొలుసు కొండ మండలంలో తాండవనదిలో చమ్మచింత, చిక్కుడుపాలెంవద్ద అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. పంచాయితీ పరిధిలోని ఇసుక ర్యాంప్‌లను ఆ పంచాయితీలోని రెండు పార్టీల నాయకులు చేజిక్కించుకొంటున్నారు. కె.కోటపాడు మండలం చేడువాడలో అన్ని పార్టీలకు చెందినవారు ఇసుక ర్యాంప్‌ను కోటి రూపాయలకు వేలం వేశారు. చోడవరం ప్రాంతంలో జుత్తాడ ర్యాంప్‌ని స్థానిక అధికారపక్షానికి చెందినవారంతా కలసి 70 లక్షలు యిచ్చి వేలంలో దక్కించుకొన్నారు. గోవాడ ర్యాంపును 20 మంది టిడిపి, వైసిపి నాయకులు 29 లక్షలకు దక్కించుకొన్నారు. ఉచిత ఇసుక విధానం రాకముందు **చోడవరం** పరిధిలో 70 లారీలు వుండేవి, ఒక దశలో కేసుల భయంతో 40 తగ్గాయి. డ్వాక్రా సంఘాలకు ఇచ్చిన తర్వాత 40 నుండి 80కి లారీల సంఖ్య పెరిగింది. ఉచిత ఇసుక విధానంతో 200లకు చేరుకొన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా అక్రమ ఇసుక త్రవ్వకాలవలన గొలుకొండ మండలం బొడ్డేరు వంతెనల వద్ద ప్రమాదకర పరిస్థితి ఏర్పడింది. ఎప్పలపాలెం ఆనకట్టకు ప్రమాదం పొంచి వుంది. **విజయనగరం జిల్లా**లోని గణపతినగరం మండలం ఎం.గుమడాం గ్రామంలో ప్రభుత్వం అనుమతించిన ఇసుక రీచ్ ఒక్కటే ఉన్నప్పటికీ అన్నిప్రాంతాల్లో అక్రమ త్రవ్వకాలు జరుగుతున్నాయి. మక్కువ మండలం వెంకటభైరీపురం వద్ద మాత్రమే ఇసుక త్రవ్వకాలకు అనుమతి వుండగా చెముడు, మక్కువ తదితర ప్రాంతాల్లో సువర్ణముఖి, గోముఖి నదుల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. **గణపతినగరం** నియోజక వర్గంలోని గంగచోళ్ళపెంట, కినిగే, లోగిశ, కెంగువ, పెడమానుపురం, **గంట్యాడ** మండలం మధుపాడ ప్రాంతంనుండి రోజూ వందల ట్రాక్టర్లతో ఇసుకరవాణా జరుగుతున్నది. వేగావతి నదిలో ఇసుక తీసేందుకు వీలు లేకపోయినా ట్రాక్టర్ల యజమానులు యధేచ్ఛగా త్రవ్వకాలు జరుపుతున్నారు. ఈ జిల్లాలోని ఓ మండలస్థాయి ప్రతినిధి అక్రమ ఇసుక నిల్వలుచేయటం, విశాఖపట్నానికి తరలించటంలో ప్రధానపాత్ర పోషిస్తున్నారు. **శ్రీకాకుళం జిల్లా** నరసన్నపేట మండలం మడపాం రేవులోని ఇసుకను విశాఖకు తరలించేందుకు కేటాయించారు. అక్కడి వ్యాపారమంతా జిల్లాలోని అధికారపార్టీకి చెందిన ప్రజాప్రతినిధితో పాటు, స్థానిక నాయకుడి ప్రోద్బలంతో సాగుతున్నది. ఇసుకను తరలించేందుకు ట్రాక్టర్‌కి కావాల్సిన ఇంధనంతోపాటు రోజుకి 700 చొప్పున అద్దె చెల్లిస్తారు. రోజుకి 40 ట్రాక్టర్లలో రేవునుండి ఇసుక విశాఖకు తరలిపోతున్నది. రోజూ 15 లక్షల వ్యాపారం జరుగుతున్నది. అనధికారిక ఇసుక రీచ్‌ల వెనుక ఒక ప్రముఖ ప్రజాప్రతినిధి, అక్రమ వ్యాపారంలో ఇద్దరు ప్రజాప్రతినిధులు కీలకపాత్ర పోషిస్తున్నారు. **పశ్చిమగోదావరి జిల్లా**లో పెద్దఎత్తున ఇసుక నిల్వలు చేపట్టారు. దీన్ని ప్రశ్నిస్తే బహుళ అంతస్తులు, సొంత నిర్మాణాలకోసమని దబాయిస్తున్నారు. జిల్లాలోని పెనుమంద్ర, మార్టేరు, పోలవరం, ఆచంట, కొవ్వూరు గ్రామాల్లో తవ్వకాలు జరుగుతున్నాయి. **తూర్పుగోదావరిజిల్లా**లోని ఆత్రేయపురం, రావులపాలెం, ఆలమూరు ఇసుక ప్రాంతాలు అధికార పార్టీకి చెందిన కీలకనేత కనుసన్నల్లో నడుస్తున్నాయి. ఆత్రేయపురం మండలం వేల్పూరువద్ద రాత్రిపూట అనధికార రీచ్‌ల నుంచి ఇసుక తరలిపోతున్నది. ప్రభుత్వ పనుల పేరుతో సీతానగరం మండలం వంగలపూడి నుండి వందలారీల ఇసుక తరలిపోతున్నది. అక్రమ ఇసుకరవాణాతో పెరిగిన వాహనాల రద్దీ వలన రహదార్లు ఛిద్రమౌతున్నాయి. ఎక్కువ లోతున ఇసుక త్రవ్వటంవలన సీతానగరం మండలంలో బోర్లకు నీరు అందటంలేదు. రాహనది ఇసుకపై ఆధిపత్యంకోసం జిల్లాలోని ఇద్దరు ఎమ్.ఎల్.ఏ.ల మధ్య వివాదం ఏర్పడింది. **కృష్ణాజిల్లా,** జగ్గయ్యపేట మండలం వేదాద్రి, రావిరాల గ్రామల పరిధిలో అధికారిక ఇసుక రేవులు లేకపోయినా అనధికారిక త్రవ్వకాలు పెద్దఎత్తున సాగుతున్నాయి. చిల్లకల్లు, బూదవాడ, జగ్గయ్యపేట, ఆటోనగర్, తక్కెళ్ళపాడు ప్రాంతాల్లో ఇసుకను నిల్వచేసి రాత్రిపూట హైద్రాబాద్ తరలిస్తున్నారు. పెనమలూరు నియోజకవర్గంలో ఇసుకరేవులపై ఆధిపత్యంకోసం ఇద్దరు ప్రముఖుల మధ్య వివాదం సంచలనంగా మారింది. **ప్రకాశంజిల్లా**లో వల్లవరం, గుండ్లకమ్మ నదిలోని పలు ప్రాంతాల్లో అనుమతిలేని ఇసుక త్రవ్వకాలు జరుగుతున్నాయి. ఇసుక త్రవ్వకంవలన మణికేశ్వరంలో బావులు ఎండిపోతున్నాయి. దర్శి, అద్దంకి మార్గంలో గుండ్లకమ్మ నది ప్రక్కనే గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. చినగంజాలోని అసైన్డ్ భూముల్లో ఇసుక నిల్వలు ఎక్కువగా వున్నాయి. దీనిపై కొన్ని సంవత్సరాలుగా రెండువర్గాల మధ్య వివాదం నడుస్తోంది. ప్రస్తుతం ఒక ప్రజాప్రతినిధి సన్నిహితుడు పెత్తనం చేస్తున్నాడు. కడప, కర్నూలు జిల్లాల్లో అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నది. ఈ రవాణాలో రాజకీయ నాయకుని అనుచరులు కీలకంగా వున్నారు.

రాష్ట్ర వ్యాపితంగా వివిధ జిల్లాల్లో ఇసుక రేవుల నుండి అక్రమరవాణా పెద్దఎత్తున జరుపుతూ వందల కోట్లు మాఫియాగ్యాంగ్ జేబులు నింపుకొంటున్న విషయం కోడై కూస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబుకి వినిపించటం లేదు, కనిపించటంలేదు. అక్రమ ఇసుకరవాణాలో ఆయన పార్టీవారే ఎక్కువగా వుండటం, వారి అవసరం చంద్రబాబుకి వుండటమే అందుకు కారణం. చంద్రబాబు ఉచిత ఇసుక విధానం అవినీతిపరులకు, మాఫియాలకు, రాజకీయ నాయకులకు మంచి ఆదాయవనరుగా మారింది. సామాన్య ప్రజలు మాత్రం అప్పుడు, ఇప్పుడు ఇసుకను డబ్బుపెట్టి కొనుగోలు చేయక తప్పటంలేదు. చంద్రబాబుకి ప్రజలు మేలుకన్నా తన పార్టీవారి ప్రయోజనాలే ముఖ్యమన్న విషయం, ఇసుక అక్రమ రవాణా మరోసారి వెల్లడించింది. ప్రభుత్వానికి చిత్తశుద్ధి వుంటే అక్రమ ఇసుక రవాణాను అరికట్టటం సమస్యేగాదు.

ఉచిత పథకం ఏదైనా అందరికీ వర్తింపచేయటం సరైందికాదు. సంపన్న వర్గాలకు దాన్ని మినహాయించాలి. ఉచిత ఇసుకలో కూడా ఆ మినహాయింపు వుండాలి. కోట్లు ఖర్చుపెట్టి అపార్టుమెంట్లు, పెద్దపెద్ద భవనాలు నిర్మించే వారికి ఉచితంగా ఇసుక ఎందుకు ఇవ్వాలి? వారినుండి డబ్బులు వసూలు చేయటంవలన వారికి వచ్చే ఇబ్బంది ఏమీ లేదు. సామాన్య ప్రజల ఇండ్ల నిర్మాణానికి, ఇతర కట్టడాలకు ఉచితంగా ఇసుకను అందించాలి. మాఫియాలపైనా, అవినీతిపరులపైనా కఠినచర్యలు తీసుకోవాలి. అప్పుడే ఉచిత ఇసుక ప్రయోజనం నెరవేరుతుంది. ✸

నదీ జలాల... (మొదటిపేజీ తరువాయి)

సాగర్ ఆయకట్టుకు సాగునీరు లేకుండా ఎండగట్టాయి. మా రాష్ట్రంలో బోరుబావులెక్కువ గనుక ఈ కరెంటును వాటికి సరఫరా చేస్తామంటూ తెలంగాణా వాదించింది. కష్ణానదీ బోర్డు ఛైర్మన్ స్వయంగా ఈ విషయాన్ని తెలిపాడు. రైతాంగానికి సాగునీటి సరఫరా పట్ల వీరికున్న శ్రద్ధ ఎంతో ఇది తెలుపుతున్నది.


ఉమ్మడి రాష్ట్రంలోనూ, ఇప్పుడు రెండు రాష్ట్రాలలోనూ విశాల ప్రాంతాలను కరువుపీడిత ప్రాంతాలుగానే వుంచారు, వుంచుతున్నారు. నగరాలలోని బడా బూర్జువాలకూ, విదేశీ పెట్టుబడికీ కారుచౌకగా శ్రామికులను సరఫరాచేసే ప్రాంతాలుగా వీటిని వుంచుతున్నారు. ఈ ప్రాంతాల నుండి ఏడాది పొడవునా మహానగరాలకు వలసలు సాగటం ప్రకృతి వైపరీత్యం వల్ల కాదు; సాగు లాభసాటి కానందువల్లకాదు. చౌక శ్రమశక్తి సరఫరా కొరకు సాగునీటి సరఫరాను నిర్లక్ష్యం చేసిన దోపిడీ పాలకవర్గాల ఉద్దేశపూరిత విధాన ఫలితమిది. గత 70 ఏళ్ళుగా సాగుతోన్న నాటకమిది.


ఇటీవల దీనికి అదనంగా మరో అంశం తోడైంది. నూతన ఆర్థిక విధానాలలో భాగంగా నీటిని వ్యాపార సరుకుగా పరిగణించమని ప్రపంచ వాణిజ్యసంస్థ, ప్రపంచబ్యాంకుల ఆదేశాలు. వీటి అర్థం స్పష్టమే. కొనుగోలు చెయ్యగలిగినవారికే నీటి సరఫరా చెయ్యాలి. దీని కోసమే కాలువల ఆధునీకరణపేరిట, నీటి మీటర్ల బిగింపు, ప్రతి నీటిబొట్టు సక్రమ వినియోగంపేరిట సూక్ష్మ, బిందుసేద్యం. వీటితోపాటు నీటి వినియోగ సంఘాలు ముందుకొచ్చాయి.

ఇలా భూముల నుండి రైతాంగాన్ని తొలగించటం, పంటల సాగును బహుళజాతి కంపెనీలు నిర్దేశించటం, ఆహారతయారీనే ఒక లాభదాయక వాణిజ్య, పారిశ్రామిక సరుకుగా మార్చటమన్న లక్ష్యంతో సామ్రాజ్యవాద ద్రవ్యసంస్థలు రుణాలిచ్చి వీటిని అమలు జరిపించాయి. భారత పాలకులు వీటినే అమలుజరుపుతున్నారు. ఫలితంగా నీటి వనరులు దోపిడీవర్గాల లాభార్జనకు వాణిజ్య సరుకుగా మారతాయి.

ఈ అసలు లక్ష్యాలను కప్పిపుచ్చేందుకే పాలకులు ఆశల పందిళ్ళు వేస్తున్నారు; మరోవైపు ప్రజల మధ్య వైమనస్యాలను రెచ్చగొడుతున్నారు. నీటిని వృధాచేస్తున్న పాత పద్ధతులు వాడుతున్నారంటూ రైతాంగంపై నింద మోపుతున్నారు.

నదీజలాలతోపాటు నీటివనరుల సమగ్ర వినియోగం కోసం ప్రజలు డిమాండు చెయ్యాలి. విడదీసే, ఆశలు కల్పించే పాలకుల మోసానికి లోనుకాకుండా, నీటిపారుదలా సౌకర్యం ఏర్పాటు కొరకు, వారు సమైక్య ఆందోళన సాగించాలి. ✸





సామ్రాజ్యవాద ప్రపంచీకరణ దుష్టవిధానాల పర్యవసానమే ప్రపంచవ్యాపితంగా పెరుగుతోన్న మితవాద, ప్రతీఘాత, ఫాసిస్టుశక్తులు

నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానం అత్యంత పెద్దగొంతుకతో పెట్టుబడిదారీ విధానానికి ప్రత్యామ్నాయమేలేదని చాటిచెపుతోంది. ప్రపంచీకరణగా పిలవబడుతున్న ఈ విధానంతో నిర్దిష్ట అభివృద్ధి ఖచ్చితంగా సాధ్యమేనని హామీ ఇస్తూ, ప్రపంచ వ్యాపితంగా విస్తరించియున్న సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ దుర్లక్షణాలన్నింటికీ సామ్రాజ్యవాద ప్రపంచీకరణే సర్వరోగ నివారిణిగా ప్రకటిస్తోంది.

కానీ, వాస్తవానికి యావత్తు మానవ కార్యకలాపాలను ద్రవ్యపెట్టుబడి తీవ్రదోపిడీకి గురిచేయటంతోపాటు, యావత్ప్రపంచంపై ద్రవ్య పెట్టుబడి పాలనను స్థిరీకరించేందుకు ఉద్దేశించినదే, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ. పెట్టుబడిదారీ విధానంలో అత్యంత సహజంగా, అనూచానంగా కొనసాగే తప్పుడు ఆర్థిక విధానాల అమలు తర్వాత, రెండున్నర దశాబ్దాల సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల అమలు తర్వాత కూడా పాదార్థిక, మేధోపర, నైతిక విలువలేమీ పెంపొందలేకపోయాయి. పైగా, అభివృద్ధిచెందిన, అభివృద్ధిచెందుతున్న దేశాలలో ఈ ప్రపంచీకరణ విధానాలు ప్రతీఘాతశక్తులను పునరుద్ధరించటంతోపాటు, ప్రపంచంలో భూమికను సాధించుకునేవిధంగా అత్యంత మితవాద రాజకీయ పార్టీల ఎదుగుదలకు, మరియు ప్రస్తుత ప్రపంచంలో సంపూర్ణంగా తిరస్కరణకు గురైన, భయంగొలిపే ఫాశిస్టుశక్తుల పెరుగుదలకు కారణ మయ్యాయి. ప్రపంచవ్యాపితంగా తలెత్తుతున్న ప్రతీఘాత శక్తులు, అంతర్జాతీయ మానవత్వ ఆదర్శాలకు అత్యంత హానికరంగా పరిణమించాయి.

గత ఎనిమిది సంవత్సరాలుగా ప్రపంచ దేశాలలో జరుగుతున్న ఘటనలు పరిశీలిస్తే, ప్రతీఘాతకత్వం పాదుకుంటూ, ప్రపంచవ్యాపితంగా విస్తరిస్తోందని పరిణామాలు సూచిస్తున్నాయి.

ప్రపంచ ద్రవ్యపెట్టుబడిదారీ విధానం చేపట్టిన అమానవీయ, క్రూర ఆర్థిక విధానాలు–ప్రపంచంలోని సహజ, మానవవనరులను ఘోరంగా దోపిడీచేసుకుంటూ ప్రపంచవ్యాపిత కార్మికవర్గాన్ని దుర్భరక్లేశంలో ముంచెత్తు తోంది; యావత్ ప్రపంచ మానవుల నడుమనా పూడ్చలేని అఖాతాల అసమానత్వాన్ని వ్యాప్తిచేస్తోంది; దురాక్రమణ యుద్ధాలు, అంతర్యుద్ధాలను ప్రేరేపిస్తోంది; నీటి కొరతలను సృష్టించటం ద్వారా అసాధారణంగా భూమండల తాపాన్ని పెంచుతోంది; ప్రపంచవ్యాప్త వ్యాధులను, ఇతర ఆరోగ్య వినాశకారకాల్ని ప్రోత్సహిస్తోంది; ప్రపంచ ప్రతీఘాత శక్తులను పెంచుతోంది. నాల్గవ విప్లవం పేరిట కొనసాగుతున్న విధ్వంసక సాంకేతిక పరిజ్ఞానం, ఇప్పటికే ప్రపంచవ్యాపితంగా ఉనికిలో వున్న అసమానతలు, నిరుద్యోగాలను అసాధారణంగా పెంచివేస్తూ, ప్రపంచ ప్రతీఘాత ఫాసిస్టుశక్తుల పెరుగుదలకు, ఆ శక్తులు గెలుపొంది అధికారం సాధించేందుకు సారవంతమైన భూమికను ఏర్పరచింది.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ సృష్టించిన 'రోబో' సాంకేతిక పరిజ్ఞానం ఫలితంగా మధ్యతరగతి ప్రజలు ఈనాడు తీవ్ర అభద్రతకు, సామాజిక అనిశ్చితికి లోనై వుండటం, ప్రతీఘాతశక్తుల పెరుగుదలకు ఒక కారణంగా వుంది. అలాగే కార్మికులపై ఘోరంగా, క్రూరంగా ద్రవ్యపెట్టుబడి సాగిస్తున్న దాడులతో కార్మిక వర్గం తీవ్ర నిరాశా నిస్పృహలకు లోనై, స్థైర్యాన్ని కోల్పోయివున్న పరిస్థితులు, ప్రతీఘాత ఫాసిస్టుభావాలకు, అభివృద్ధి నిరోధక, తిరోగమన భావాలకు వారు లోబడటానికి అవకాశం కల్పిస్తోంది.

వివిధ దేశాలలో ప్రభుత్వాలు విద్య, ఆరోగ్య రక్షణవంటి ప్రభుత్వ సేవలలో భారీకోతలను విధిస్తూ, పొదుపు చర్యలపేరిట అమలుచేస్తున్న విధానాలు పేదరికాన్ని మరింతగా పెంచుతున్నాయి; పేదలను నిరుపేదలుగా దిగజారుస్తూ అత్యంత అభివృద్ధి నిరోధక శక్తుల బోధనలకు, దుష్ప్రచారానికి లోను చేస్తున్నాయి. వలస వచ్చినవారే ఉద్యోగాలన్నింటినీ దొంగిలిస్తున్నారని, ప్రజా సమూహాల పేదరికానికి, నేరాలు పెరిగిపోవటానికి, సంక్షేమ పథకాలు సక్రమంగా చేరకపోవటానికి వారే కారణమనే దుష్ప్రచారాలకు కార్మికులు లోనవుతున్నారు. ఈ విధమైన సాధారణ ఆర్థిక పదజాలంతో మితవాద పార్టీలు జాత్యహంకారాన్ని, కార్మికుల నడుమ, ఆదివాసుల నడుమ భావోద్వేగాలను ముసుగులో వ్యాప్తిజేస్తున్నాయి. తమ సూపర్ లాభార్జనకోసం ప్రపంచ ద్రవ్యపెట్టుబడి నేర్పుగా దిగుమతి చేసిన కారుచౌక శ్రామికులకు వ్యతిరేకంగా మంటలను రాజేస్తున్నాయి. ప్రపంచవ్యాపితంగా మానవత్వ విధ్వంసానికి, కార్మికుల దుర్భరస్థితిగతులకు కారణమైన నయా ఉదారవాద పెట్టుబడిదారీవ్యవస్థను, సామ్రాజ్యవాద అంతర్జాతీయ ద్రవ్య మరియు వాణిజ్య సంస్థలను లక్ష్యంగా చేసుకోవటానికి బదులుగా, ఈ అభివృద్ధి నిరోధక, ఛాందస, మితవాద, ప్రతీఘాత శక్తులు, వీరికి ప్రాతినిధ్యం వహించే రాజకీయపార్టీలు – సామాజికంగా, మతపరంగా, ఆదివాసులపరంగా ప్రపంచ ప్రజానీకంలో చీలికలు కల్పిస్తున్నాయి; నిలకడగా ప్రజల మధ్య ఆరని చిచ్చును రగుల్చుతూ సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ విధాన మార్గదర్శకత్వంలో, ఆ దన్నుతో ప్రపంచీకరణ ముసుగులో ప్రజానీకానికంతటికీ నిజమైన శత్రువు అయిన ద్రవ్య పెట్టుబడికి వ్యతిరేకంగా పోరాట మొనను ఎక్కుపెట్టనీయకుండా ప్రక్కదోవ పట్టిస్తున్నాయి.

స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలకు మారుపేరుగా ప్రకటించుకుంటున్న, ప్రజాస్వామ్యంలో ప్రగాఢ విశ్వాస ముందని చెప్పుకుంటున్న అమెరికాలో ఆఫ్రో – అమెరికన్లపై జాత్యహంకార దాడులు పెచ్చుమీరుతున్నాయి. ఒక ఆఫ్రో అమెరికన్‌గా చెప్పుకుంటున్న వ్యక్తే దేశాధినేతగా వున్న ఈ కాలంలోనే ఆఫ్రో – అమెరికన్లపై క్రూరమైన దాడులు పెరిగిపోతున్నాయి.

రిపబ్లికన్ పార్టీకి చెందిన అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ఓటర్ల నుండి మద్దతును కూడగట్టగల్గుతున్నాడు. డొనాల్డ్ ట్రంప్‌కు, అతని అసహనపు మితవాద పిడివాదానికి ఆశ్చర్యకరమైనంత భూమిక లభిస్తోంది. హిస్పానిక్కులను, నల్లజాతివారిని, "చైనీయుల" వంటి విదేశాల నుండి వచ్చినవారిని ఎంచుకొని అతను దాడిచేస్తున్నాడు. వలసవచ్చిన వారిపై, మహిళలపై, మైనారిటీలపై అతను అత్యంత ఛాందసవాద, అభివృద్ధి నిరోధక, యుద్ధోన్మాద వ్యాఖ్యానాలు చేస్తున్నాడు. అమెరికాలో నూతన మధ్యతరగతి అతని చుట్టూతా సమీకృతమౌతోంది. మరోవైపున, డెమోక్రాటిక్ పార్టీకి చెందిన అధ్యక్ష అభ్యర్థి హిల్లరీ క్లింటన్ కూడా సాధారణ అమెరికా ప్రజలను, వారి ఆకాంక్షలను దిగజార్చిన, నిరాశకు గురిచేసిన వ్యవస్థలపట్ల తను ఏ రకంగానూ వ్యతిరేకంగా ఉండబోనని ట్రంప్‌కన్నా మెరుగైనదానను కాననీ తనకు తాను నిరూపించుకుంటోంది.

స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి ప్రజాస్వామిక, ఉదారవాద భావాలకు మాతృభూమి అయిన ఐరోపాలో మితవాద పార్టీలు తమ పట్టును పెంచుకుంటున్నాయి. యూరోపియన్ యూనియన్ దేశాలలో ఆయా ప్రభుత్వాలు అమలుచేసిన పొదుపు చర్యల ఫలితంగా పేదరికంలోకి నెట్టబడిన శ్రామిక ప్రజలలో అత్యంత మితవాద, ఛాందసవాద భావాలను పాదుగొల్పిన ఫలితమే 'బ్రెగ్జిట్'.

యుద్ధం కారణంగా కకావికలై, సిరియా నుండి కొనసాగుతున్న వలసల మహాప్రవాహం సృష్టించిన మందకొడి ఆర్థికవ్యవస్థ, సంక్షోభాలు – యూరోపియన్ యూనియన్ దేశాలలో అత్యంత మితవాద పార్టీలు తమ పట్టు పెంచుకునేందుకు దోహదపడ్డాయి. ఫ్రాన్స్‌లో వలసల వ్యతిరేక, యూరోపియన్ యూనియన్ వ్యతిరేక, 'ప్రొటెక్షనిస్ట్ నేషనల్ ఫ్రంట్', జర్మనీలో 'ఫార్ – రైట్ ఆల్టర్‌నేటివ్ ఫర్ జర్మన్ పార్టీ', ఆస్ట్రియాలో 'యాంటి ఇమ్మిగ్రెంట్ ఫ్రీడమ్ పార్టీ', హంగేరి, పోలెండ్‌లలో మితవాద పార్టీలు – వంటివన్నీ ప్రపంచంపై ద్రవ్య పెట్టుబడి పాలన యొక్క దుష్పరిణామాలుగా ముందుకొచ్చాయి.

జర్మనీలో తిరిగి నాజీయిజమ్ 'ఫార్ – రైట్ ఆల్టర్‌నేటివ్ ఫర్ జర్మన్ పార్టీ' పేరుతో పట్టు పెంచుకొంటున్నది. గ్రీస్‌కు అందించే సహాయం నిలిపి వేయాలని, వలస వచ్చేవారిని, కాందిశీకులను దేశంలోకి ప్రవేశించనీయరాదని ఆ పార్టీ డిమాండ్ చేస్తోంది. అది ఇస్లామ్‌కు వ్యతిరేకంగా వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించింది. ఇస్లామ్ భావాలను, ముస్లిములను, వలసలను వ్యతిరేకిస్తూ ఆ పార్టీ ప్రచారం నిర్వహిస్తోంది. 'పశ్చిమదేశాల ఇస్లామీకరణకు వ్యతిరేకంగా, దేశభక్తియుత యూరోపియన్లు' అనే సంస్థ నాయకులు, మరియు 'ఆల్టర్‌నేటివ్ ఫర్ జర్మనీ పార్టీ' నాయకులు ఉపయోగించే భాష, భావజాలం అడాల్ఫ్ హిట్లర్ ఉపయోగించిన భాషకు, భావాలకు అతి దగ్గరగా వుంది. ఇస్లామ్ మతానికి వ్యతిరేకంగా ఎక్కుపెట్టిన వీరు, ముస్లిములకు వ్యతిరేకంగా ద్వేషాన్ని, అసహనాన్ని పెంచుతున్నారు.

ఇటీవల గ్రీస్ దేశంలోని ఫిలిప్పి మరియు ఒరైకాస్ట్రో పట్టణాలలో తల్లిదండ్రుల సంఘాల ప్రతినిధులు తమ బిడ్డలు చదువుకుంటున్న పాఠశాలల్లో వలస వచ్చినవారి పిల్లలు చేరటాన్ని వ్యతిరేకిస్తూ విద్యా మంత్రిత్వశాఖకు ఓ లేఖ రాశారు : "ఎట్టి పరిస్థితుల్లోనూ, ఎలాంటి రాజీ లేకుండా స్పష్టంగా మరియు వివరంగానూ తాము ప్రకటిస్తున్నదేమంటే, అక్రమ వలసదారులుగా చెప్పబడుతున్నవారి పిల్లలు మా బిడ్డలు చదువుతున్న పాఠశాలల్లో ప్రవేశించటానికి అంగీకరించబోము" అని, "ఇతర ఖండాల నుండి వలస వచ్చిన వారి పిల్లలు పూర్తి భిన్నమైన ఆరోగ్యపరిస్థితులు, భిన్నమైన వ్యాధులతో, భిన్నమైన ఆకారాలను కలిగి వుంటార"ని, కనుక వారు దేశంలోని విద్యాసంస్థల్లో చేరితే "పాఠశాలల గ్రీకు స్వభావం" మారిపోతుందని వారు ఆ లేఖలో పేర్కొన్నారు. "వలసవచ్చిన వారి మత మౌఢ్యాన్ని మేమెన్నడూ అంగీకరించబోము" అని వారు పేర్కొన్నారు. వలస వచ్చిన వారి పిల్లలను పాఠశాలల్లో చేర్చుకునేట్లయితే దానికి నిరసనగా తల్లిదండ్రుల సంఘాలు పాఠశాల ఆవరణలను ఆక్రమించుకోవటానికి సిద్ధమని కూడా వారు హెచ్చరించారు. దీనికి కొద్దిరోజుల ముందుగా, ఆ ప్రాంతంలో కొన్ని ఇళ్ళలోకి వలస వచ్చినవారు ప్రవేశించనున్నారనే పుకార్ల నడుమ ఒరైకాస్ట్రో మేయర్ ఓ ప్రకటన చేస్తూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకో వలసిందిగా స్థానికంగా నివశిస్తున్నవారికి పిలుపు నిచ్చాడు. వలసల వ్యతిరేక, కాందిశీకుల వ్యతిరేక ప్రతీఘాత భావాలు గ్రీస్‌లో ఏవిధంగా, ఏ స్థాయిలో వ్యాపించి వున్నాయో, పాతుకుపోయాయో ఈ ఉదంతం తెలియజేస్తోంది.

ఇంగ్లాండ్‌లో బ్రెగ్జిట్ తర్వాత జాత్యహంకారదాడులు పెరిగాయి. యూరోపియన్ యూనియన్ నుండి బయటకు రావాలనే ఇంగ్లాండ్ నిర్ణయం తర్వాత ఇంగ్లాండ్‌లో వరుసగా అనేక సంఘటనలు చోటుచేసుకున్నాయి. వలసవచ్చిన వారిపై దౌర్జన్యాలు చేస్తూ, వారిని తిరిగి వారి మాతృదేశం వెళ్ళిపొమ్మని బెదిరింపులకు గురి చేశారు. పోలిష్ జనసమూహానికి వ్యతిరేకంగా, వారిని ఉద్దేశించి విభ్రాంతి కల్గించే దూషణల సంఘటనలు జరిగాయి. 'యూరోపియన్ యూనియన్ నుండి వైదొలగాలి – అలాగే పోలిష్ క్షుద్ర పురుగులు కూడా' అని లండన్‌లో హామర్ స్మిత్ సెంటర్ వద్ద పోలిష్ జనసమూహం అధికంగా నివసించే చోట గోడపై గజిబిజి రాతతో రాశారు; అదేరకపు దూషణలతో కూడిన ప్లకార్డులను కేంబ్రిడ్జిలోని హెమ్టింగ్‌టన్‌లో పోలిష్ జనసమూహం వుండే ప్రాంతంలో అంటించారు. జాత్యహంకార వ్యతిరేక వేదిక 'ఫార్ రైట్ వాచ్' కథనం మేరకు 3 రోజుల కాలవ్యవధిలో మౌఖికంగా దూషణల నుండి భౌతిక హింస వరకు 90కి పైగా ఘటనలు జరిగాయి. ఫ్యాక్టరీ కార్మికులు, వ్యవసాయ కార్మికులు, నిరుద్యోగులు వంటి ఆర్థికంగా దుర్బలులైన వారితోసహా, ప్రపంచ ద్రవ్యపెట్టుబడి యొక్క సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల కారణంగా కునారిల్లి, అసంతృప్తితో వున్నవారంతా ఈ జాత్యహంకార భావాలకు, దురభిమానానికి లోనయ్యారు. 2016 జూన్, జులై నెలల్లో ఈ ద్వేషపూరిత నేరాలు ఎలా పెరిగాయో స్కాట్‌లాండ్ యార్డ్ కమీషనర్ సర్ బెర్నార్డ్ హోగాన్ పేర్కొంటూ, ఈ దాడులన్నీ ప్రత్యేకించి తూర్పు ఐరోపా వాసులకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడ్డాయన్నారు. పాత యూరోపుకు చెందిన 'యూదు వ్యతిరేక ఉన్మాదం'తో మరియు యూరపులోని అతిమితవాదంతో యూదు ప్రజా సమూహాల ఉనికే ప్రశ్నార్థకంగా మారిపోయిందని 'కాన్ఫరెన్స్ ఆఫ్ యూరోపియన్ రబ్బీస్' అధ్యక్షుడు పింఛాస్ గోల్డ్‌స్మిద్ పేర్కొన్నాడు. యూరోపియన్ దేశాలలో 'యాంటి – సెమిటిజమ్' ప్రాచుర్యంలో వుందని అతను చెప్పాడు. 9 యూరపు దేశాలలో నిర్వహించిన సర్వే ప్రకారం యూదులు వారి భద్రత అంశంలో భయం కారణంగా 22 శాతం సామాజిక కార్యక్రమాలకు హాజరుకాకుండా తప్పుకుంటున్నారు. ఫ్రాన్స్‌లో 1200 మంది యూదులను సర్వేచేయగా 40 శాతం మంది తాము మతపర చిహ్నాలను ధరిస్తే, తమను యూదులుగా గుర్తించి, తమపై దాడులు జరుపుతారనే భయంతో వాటిని ధరించకుండా వుంటున్నామని తెలిపారు. యూరోపియన్ యూనియన్‌లో మానవత్వపు దుస్థితి ఈవిధంగా వుంది!

డెన్మార్క్, నెదర్లాండ్స్ మరియు ఆస్ట్రియాలలోనూ మితవాద, ప్రతీఘాత పార్టీలు ప్రాబల్యం పొందుతున్నాయి.


సంఘ్‌పరివార్ వంటి ప్రతీపశక్తుల దన్నుతోనున్న బిజెపి మనదేశంలో ప్రభుత్వాధికారాన్ని చేజిక్కించుకుంది. హిందూ మతోన్మాద శక్తులు సమాజం మొత్తంలో వ్యాపించి మత మైనారిటీల, దళితుల, అణచబడిన సెక్షన్ల ప్రజానీకపు మనుగడను కంటకావృతం చేస్తూ పాలన సాగిస్తున్నాయి; సాంస్కృతిక పోలీసులుగా వ్యవహరిస్తున్నాయి. గోరక్షక్‌ల ముసుగులో అరాచక గుంపుల దాడులు విస్తారంగా జరుగుతున్నాయి. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా జాతీయ దురహంకారం అధికారయుతంగానే ఎగదోయబడుతున్నది. 'ఉగ్రవాదంపై పోరాటం' ముసుగులో ఇస్లామ్‌పై వ్యతిరేకత రెచ్చగొట్ట బడుతున్నది. 'చట్టబద్ధ పాలన'ను చట్టమే పాలనగా మార్చివేశారు. ప్రజాస్వామికంగా ఆలోచన చేసేవారిపై, కార్యకర్తలపై, రాజకీయ ప్రత్యర్థులపై దాడిచేసేందుకే చట్టం ప్రయోగించబడుతున్నది. 2016 జూన్‌లో హిందూ మతతత్వ సంస్థ అయిన 'హిందూసేన' మధ్య ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద డొనాల్డ్ ట్రంప్ పుట్టినరోజు వేడుకలను పండుగ బట్టలు, బూరలు, పోస్టర్లు తదితర హంగామాలతో ఎంతో ఆర్భాటంగా నిర్వహించింది. ప్రతీఘాత శక్తులు ప్రాబల్యం పొందుతూ ఇప్పటికే చిరుగులు పడిన ఈ సమాజానికి తీవ్ర హెచ్చరికగా పరిణమించనున్నాయి.

ఈ పరిణామాలన్నీ ద్రవ్య పెట్టుబడిదారీ విధానపు ఏలుబడిలో పెట్టుబడిదారీ విధానపు అనివార్య, సహజ పరిణామాలైన 2008 నాటి ప్రపంచ ఆర్థిక సంక్షోభ దుష్ఫలితాలే. మరోమాటల్లో చెప్పాలంటే, నయా ఉదారవాద సామ్రాజ్యవాద ప్రపంచీకరణ వైఫల్యం యొక్క ఫలితాలే ఈ తిరోగమన పరిణామాలన్నీ! ద్రవ్య పెట్టుబడిదారీ విధానం, ప్రపంచ దేశాలపై రుద్దిన పెట్టుబడిదారీ వ్యవస్థ, ఈ పరిణామాలను ఏవిధంగానూ మరమ్మత్తు చేయజాలదు. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ యొక్క ఘోరమైన దుష్ఫలితాలివి.

పెట్టుబడిదారీవ్యవస్థ ఏ రూపంలో వున్నాకానీ అది ప్రజల జీవితాలలో అభివృద్ధిని, సౌభాగ్యాన్ని తీసుకురాలేదని రుజువైన వాస్తవం. కాగా, ఈ పెట్టుబడిదారీ విధానపు సంక్షోభం తిరోగమన, ప్రతీఘాతుక, ఫాశిస్టు విధానాలకు దోవతీస్తుందనేది అంతే వాస్తవం.

ఉదారవాదులైన లేదా ఛాందసులైన పార్లమెంటరీ రాజకీయపార్టీలుగానీ లేదా అధికార దాహంకల వామపక్షాలు కానీ పెట్టుబడిదారీ విధానం సృష్టిస్తున్న విధ్వంసానికి, విలయానికి ప్రత్యామ్నాయం కాలేవు, కావుకూడా. ప్రపంచ మానవాళికంతటికి సమానత్వాన్ని, అభివృద్ధిని అత్యున్నత సార్వత్రిక సంక్షేమాన్ని, అందజేయ గలిగేది కమ్యూనిజం ఒక్కటి మాత్రమే!

కమ్యూనిజం పతాకను చేబూని శాస్త్రీయ వర్గ రాజకీయ శస్త్రధారులైన కార్మికవర్గం మాత్రమే, చరిత్ర తమ భుజస్కంధాలపై వుంచిన బృహత్తర కర్తవ్యాన్ని చేబూని, యావత్తు మానవజాతి పాలిట పెనుశాపంగా, అభివృద్ధికి ఆటంకంగా నిలిచిన ఈ ప్రతీఘాతుక, ఫాసిస్టు శక్తులను ఓడించి తీరుతారు. ★



తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ కమిటి ప్రచురణ

ప్రజా సేవలో

తరిమెల నాగిరెడ్డి

ఎడిటర్ : చెరుకూరి సత్యనారాయణ

పేజీలు : 512 వెల : రూ. 90/-

కాపీలకు : **మైత్రీబుక్‌హౌస్,**

జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్ రోడ్, విజయవాడ–2

కనీస వేతన చట్టాన్ని ఎత్తివేసే ప్రయత్నాలలో బడాపెట్టుబడిదారీవర్గంతో కుమ్మక్కైన దేశ పాలకులు

మన 'స్వతంత్ర' దేశాన్ని 'మన పాలకులు' పాలించటం ప్రారంభమైన 69 సంవత్సరాల తర్వాత కూడా; మన ఆర్థికవ్యవస్థను పరిగణించదగిన అభివృద్ధి దిశగా నడిపిస్తాయని, అగ్రరాజ్యాల సరసన మనదేశాన్ని నిలబెడతాయని ప్రకటించిన నయా ఉదారవాద పెట్టుబడిదారీ ఆర్థిక విధానాల, సంస్కరణల అమలు ప్రారంభమై 25 సం॥లు గడిచిన తర్వాత కూడా – మనదేశంలో కార్మికులకు కనీసవేతనాలను చెల్లించట మనేది, ఓ ఎండమావిగానే మిగిలిపోయింది.

పాలకులు, బడాపారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు కూడా కనీస వేతన దృక్పథాన్ని ఆమోదించేందుకు, కనీస వేతనాల చెల్లింపులోనున్న న్యాయబద్ధమైన అంశాన్ని అంగీకరించేందుకు అది చట్టబద్ధమైన ఆదేశమైనప్పటికీ నిరాకరిస్తున్నారు.

వాస్తవానికి ప్రపంచ ఆర్థిక, సామాజిక అభివృద్ధి గురించి ఊదరగొడ్తున్న ఈ 21వ శతాబ్దపు ఆధునిక కాలంలో మనదేశంలోని కార్మికులంతా జీవన వేతనాలను పొందాల్సి వుంది. అయితే, జీవన వేతనాలను ప్రక్కనుంచినా, మనదేశ కార్మికులకు సమంజసమైన వేతనాలు కూడా లభించటంలేదు. కార్మికులకు కనీస వేతనాన్ని మాత్రమే డిమాండ్ చేయగలస్థితిలో నేటి మనదేశ కార్మికోద్యమ స్థితి వుంది. ఈ కనీసపాటి డిమాండ్‌ను కూడా పారిశ్రామికవేత్తలు వివిధ కారణాలతో నిరాకరిస్తూవస్తోన్నారు.

మనదేశంలో దాదాపు 40 కోట్లమంది కార్మికులుంటే, వారిలో 90శాతం కార్మికులు–అనియత, అసంఘటిత రంగాలలో ఏవిధమైన చట్టబద్ధ సౌకర్యాలూ రక్షణలూ లేకుండా, కనీస అవసరాలను తీర్చుకోవటానికి, తమను, తమ కుటుంబసభ్యులను పోషించుకునేందుకు అవసరమైన కనీసవేతనాలు కూడా లేకుండా బ్రతుకులీడుస్తున్నారు.

వ్యవస్థీకృత మరియు సాంప్రదాయ కార్మిక యూనియన్ల నాయకత్వం ఇచ్చిన సెప్టెంబర్ 2 సార్వత్రిక సమ్మె పిలుపు సందర్భంగా పేర్కొన్న డిమాండ్లలో, దేశవ్యాపితంగా కనీసవేతనాన్ని 15వేల రూ॥లుగా ప్రకటించాలనే ఒక డిమాండు వుంది. ఈ నేపథ్యంలో కార్పొరేటు ప్రసార మాధ్యమాలలో కనీసవేతనాలపై అనేకమంది ఆర్థికవేత్తలు, ప్రత్యేక నిపుణులు, హెచ్.ఆర్. మేనేజర్లు, మరియు సంపాదకులనేకమంది చర్చల్లో పాల్గొని అనేక వాదనలు ముందుకు తెచ్చారు. తమ పాండిత్య ప్రకర్షను ప్రదర్శిస్తూ, నయా ఉదారవాద పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థ దృక్కోణంతో ఎక్కువమంది వాదనలు చేశారు. మనదేశంలో సార్వత్రిక కనీస వేతనాల చెల్లింపు అనేది ఆచరణయోగ్యంకాదని, సాధ్యమూకాదని, పొరపాటు ఆలోచనని వారు తమ వాదనలలో పేర్కొన్నారు. కార్మికుడనేవాడు ఒక ప్రాణమున్న మనిషని, ఆతనిపై కుటుంబసభ్యులందరూ ఆధారపడివున్నారని, వారి విద్య, వైద్యం, బట్టలు తదితర కనీస అవసరాలకు వారు ఆ కార్మికునిపై ఆధారపడి వుంటారని; భవిష్యత్తు లేబర్ మార్కెట్ అవసరాల కనుగుణమైన పిల్లలకు శ్రామికుడు జన్మనివ్వాల్సి వుంటుందనే అంశాల్ని ఈ చర్చల్లో పాల్గొన్న వారంతా పరిగణలోకే తీసుకోకుండా, చాలా తక్కువగా అంచనా వేస్తూ మాట్లాడారు. మార్కెట్ ఆర్థికవ్యవస్థలో, మార్కెట్‌లో హెచ్చుతగ్గులపై ఆధారపడిన మార్కెట్ సరుకుగా మాత్రమే వారు కార్మికుని పరిగణిస్తున్నారు.

వాస్తవానికి, మనదేశంలో కార్మికవర్గం సుదీర్ఘకాలం సాగించిన పోరాటాల ఫలితంగా, 1957లో జరిగిన 15వ భారత కార్మికసదస్సు కనీస వేతనాలను నిర్ధారించేందుకు ఒక సూత్రాన్ని రూపొందిస్తూ, ఈ దిగువ అంశాలను పరిగణలోకి తీసుకోవలసివుంటుందని చెబుతూ వాటిని తప్పక అమలుపర్చాల్సిన అంశాలుగా పేర్కొంది. 1. మూడు వినియోగ ప్రమాణాలకు అనుగుణంగా కనీసవేతనం వుండాలి. 2. ఒకరోజుకు 2,700 క్యాలరీల శక్తిగల ఆహారాన్ని సమకూర్చుకోగలగాలి. 3. కార్మికుని కుటుంబానికి అవసరమైన 72 గజాల బట్టల అవసరాన్ని తీర్చగలగాలి. 4. సబ్సిడీపై అందించే గృహవసతి లేదా దానికి సమానమైన గృహవసతికి చెల్లించవలసిన అద్దె సమకూర్చుకోగల్గాలి. 5. కనీస వేతనంలో 20 శాతం ఇంధనం, విద్యుత్తు మరియు ఇతర అనేకానేక అవసరాలను తీర్చగలగాలి. కార్మికుల బిడ్డల విద్య, వైద్య అవసరాలు తదితరాలను జోడిస్తూ కనీసవేతనం గురించి పైన పేర్కొన్న లెక్కకు 1991లో, సుప్రీంకోర్టు మరో 25 శాతం వేతనాన్ని కలపాలని ఆదేశించింది. కానీ కనీస అవసరాలలో అనేకమార్పులు చోటుచేసుకున్న ప్రస్తుత కాలంలో, ముందంజవేసిన, అభివృద్ధి సాధించిన మరింత నాగరీకమైన వాతావరణంలో కనీస వేతనాలను మరింతగా పెంచాల్సిన అవసరముంది. అది ఖచ్చితంగా లెక్కలేస్తే నెలకు 22,000 రూ॥గా వుంటుంది. కనుక, కార్మికుడిని ఓ వ్యాపార వస్తువుగా కాకుండా ఓ మానవునిగా పరిగణిస్తే, ఇదీ కార్మికుని కనీసవేతనాన్ని లెక్క వేయటంలో తప్పనిసరిగా అవలంబించాల్సిన సూత్రబద్ధమైన అవగాహనగా వుంటుంది.

అయితే, మన పాలకులు ఒక పద్ధతి ప్రకారం ఈ అవగాహనను పూర్తిగా తుడిచిపెడ్తూ, క్రమంగా కనీసవేతనాలను నిర్ణయించే వ్యవస్థనే ఎత్తివేయ జూస్తున్నారు. ప్రభుత్వాలకుగాక మార్కెట్టుకే నియంత్రణాధికారాలు కలిగివుండే నయాఉదారవాద ఆర్థిక విధానాలను, సంస్కరణలను పాలకులు అమలు చేస్తున్నప్పటినుండి ప్రపంచ స్వేచ్ఛావాణిజ్యంలో సామర్థ్యాన్ని, పోటీతత్వాన్ని నిలిపివుంచే విధంగా విలువను నిర్ణయించటంతో కనీస వేతన చట్టాన్ని రద్దుచేయ తలపెట్టారు. చట్టబద్ధమైన కనీస వేతనాలను చెల్లించటానికి కూడా పారిశ్రామిక యాజమాన్యాలు అభ్యంతరాలు తెలుపుతూ వస్తున్నాయి. ప్రభుత్వం కూడా వారి వాదనలతో ఏకీభవిస్తూ, వాటికి తలూపుతూ వస్తోంది. 'మేక్ ఇన్ ఇండియా' నినాదాన్ని ప్రభుత్వం చేబట్టిన తర్వాత చైనా, వియత్నాం, కంబోడియా, బంగ్లాదేశ్‌లలో చౌకగా లభించే శ్రమశక్తికంటే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడికి మనదేశంలో మరింత కారుచౌకైన శ్రమశక్తిని సమకూర్చటానికి సంసిద్ధమైంది.

సెప్టెంబర్ 2 సమ్మె పిలుపును ఉపసంహరింపజేసే చర్యల్లో భాగంగా ఎన్‌డిఏ ప్రభుత్వం కనీస వేతనాన్ని కేవలం నెలకు 10,000 రూ॥గా నిర్ధారిస్తానంటూ ముందుకు వచ్చింది.

అయితే, పారిశ్రామిక యాజమాన్య సంఘాలైన ఎఫ్ఐసిసిఐ వంటి వాటి నుండి ఎదురైన తీవ్ర అభ్యంతరాలతో కాంట్రాక్టు కార్మికులకు నెలకు పదివేల రూ॥ల కనీసవేతనాన్ని నిర్ణయించే తమ నిర్ణయాన్ని నిలిపివేసిన కేంద్ర కార్మిక మంత్రిత్వశాఖ, వేతనాల నిర్ధారణ అంశమేదో అంతర్జాతీయ పరిధిలోదైనట్టూ, అంతర్జాతీయస్థాయి నిపుణులు తేల్చవలసిన అపరిష్కృత సమస్య అయినట్టూ "అంతర్జాతీయ సంప్రదింపులు" సాగించే విధానాన్ని "ఎంచుకుంది". ఇది గమనించిన ఎవరైనా మనదేశం సార్వభౌమదేశమని, మన ప్రభుత్వాలు సార్వభౌమాధికారం కలిగిన ప్రభుత్వాలంటే ఫకాలున నవ్వుతారు.

మనదేశ పాలకులు–ప్రత్యేకించి ఎన్‌డిఏ ప్రభుత్వం 'అంతర్జాతీయ ఖ్యాతి' గురించి గౌరవ ప్రపత్తులతో మాట్లాడుతూ, దానిపై ఆధారపడుతూ కూడా 1970లో జరిగిన ఐక్యరాజ్యసమితి 131వ సమావేశాలలో ఆమోదించిన కనీస వేతన నిర్ధారణ సూత్రాలకు ఈనాటికీ సర్వామోదాన్ని తెలపలేదు. (ఐక్యరాజ్యసమితిలో తాను ఓ ప్రాముఖ్యత కలిగిన సభ్యదేశమని గొప్పలు చెప్పుకుంటూ కూడా)

2016 సెప్టెంబర్ 17, 18 తేదీలలో 'బిజినెస్ స్టాండర్డు' పత్రిక తన సంపాదకీయంలో జాతీయస్థాయిలో కనీసవేతనాన్ని 15,000 రూ. పెంచాలనే నిర్ణయం చాలా పొరపాటైనదిగా పేర్కొంది. అలాంటి ఒక నిర్ణయమే గనుక జరిగితే దిగువ పేర్కొనే విపరిణామాలు సంభవిస్తాయని చెప్పింది: ఎ) కనీసవేతన పెంపుదల అనే ఆ మార్పు, చట్టాల పుస్తకాలకు మాత్రమే పరిమిత మౌతుంది; మార్కెట్‌లో అమలుకు మాత్రం నోచుకోదు. బి) 'కార్మికులను పనిలో పెట్టుకోవటం సాధ్యమైనంతవరకు ఎలా తగ్గించగలం? లేదా యంత్రాలను ఎక్కువగా ఏవిధంగా వాడగలం' అని అత్యధిక సంఖ్యలో యజమానులు ఆలోచన చేస్తారు. సి) కేరళలో సాగించే వరిసాగు, కొబ్బరిపీచు ఉత్పత్తులు వంటి అనేక పనులు అధిక వేతనాల చెల్లింపుతో గిట్టుబాటుకాకుండా పోయాయి. డి) 15,000 రూ॥ల కనీసవేతనంగా నిర్ణయిస్తే, ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఏర్పడవు.

కార్మికులకు ఉపాధి కల్పించే ఏకైక లక్ష్యంతో మాత్రమే పరిశ్రమలు మరియు వాణిజ్య, వ్యాపారసంస్థలు తమ సంస్థలను నడుపుతున్నట్లూ, 'సూపర్ లాభాలు' సాధించుకోవటం కోసంమాత్రం కాదన్నట్లుగా 'బిజినెస్ స్టాండర్డు' సంపాదకుడు ఇచ్చిన తెలివైన సలహా, ఓ భ్రమను ప్రచారంలో పెడుతున్నది. పారిశ్రామిక యజమానులు తమ ఉత్పత్తి పెంపు కోసం విడిభాగాల యితర ముడివస్తువుల ధరలు పెరిగిన మేర వాటికి చెల్లిస్తున్నారు. కానీ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించటానికి మాత్రం వారు సిద్ధంకాకుండా, ఉత్పత్తి ఖర్చులను తగ్గించాలనే పేరుతో అత్యంత తక్కువ వేతనాలతో కార్మికుల శ్రమను కొల్లగొడుతూ, వారి శ్రమశక్తిని దోచుకుంటున్నారు. తిరిగి మరలా ఉత్పత్తి ఖర్చు తగ్గింపు పేరుతోనే, ఉత్పత్తిని పెంపు చేసుకొని లాభాలు గడించేందుకు పారిశ్రామిక యజమానులు యాంత్రీకరణ చేపడుతున్నారు. కనుక, పారిశ్రామిక యజమానులు దయ, జాలితో కార్మికులకు ఎట్టి పరిస్థితుల్లోనూ పని కల్పించరని స్పష్టమౌతోంది. లాభసాటి అయిన యంత్రాలు అందుబాటులో వుంటే, కార్మికుల పట్ల దయా దాక్షిణ్యాలతో పారిశ్రామిక యజమానులు అటువైపు మరలకుండా ఆగరు. కనుక, పై సంపాదకీయపు సలహాలోని రెండు పార్శ్వాలను గమనిస్తే, ఆ సలహా ఊహాజనిత అంశాలపై ఆధారపడి వాస్తవాన్నుండి దృష్టిని మళ్ళించటానికి ఉద్దేశించిందిగా అర్థమౌతుంది. వరిసాగు లేదా కొబ్బరిపీచు ఉత్పత్తులు గిట్టుబాటు కాకపోవటానికి ప్రధానమైన, ప్రాథమికమైన కారణం కనీస వేతనాల పెంపుసమస్య కాకపోగా, ఇతర అనేక కారణాలున్నాయి; వాటిని ప్రత్యేకంగా చర్చించాలి. అయితే, ఆ ప్రత్యేక అనుభవాన్ని యావద్దేశంలోని పారిశ్రామికరంగాలన్నింటికీ సాధారణీకరించి వర్తింప జేయటమంటే, కార్మికుల కనీసవేతన సూత్రాన్ని, అవగాహనను నిరాకరించటమే.

కనీస వేతనాలను నిర్ధారించటంలో కనీస మౌలిక అవసరాల దృక్పథం వంటి అత్యావశ్యక అంశాలను పరిగణలోకి తీసుకోవాలి. మనదేశంలో భిన్న రాష్ట్రాల నడుమ అసమానతలు, తేడాలు ఉన్నప్పటికీ, కనీస ఆహార వస్తువుల ధరలు, ఇంటి అద్దెలు, విద్యా, వైద్య వ్యయాలు మాత్రం ఒకే స్థాయిలో వున్నాయి. అలాగాకుంటే, చట్టబద్ధమైన ఆదేశిత అవగాహనకు మరియు కనీస వేతనాన్ని నిర్ణయించే సూత్రాల పారామీటర్స్ యొక్క అవసరమేముంది? ప్రస్తుత కాలంలో నిరంతరం పెరుగుతున్న సరుకుల, సేవల ధరల స్థాయికనుగుణంగా కార్మికులకు కనీస వేతనాలను నిర్ణయించటానికి మార్కెట్ వ్యవస్థ హెచ్చు తగ్గులతో ఎలాంటి నిమిత్తం వుండరాదు.

కొందరు 'నిపుణులు' వ్యాఖ్యానిస్తున్నట్లుగా 'కార్మిక అంశం' రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని అంశమైనప్పటికీ జాతీయ కనీసవేతనాన్ని నిర్ధారించి, కార్మికులకు చెల్లించటంలో ఎలాంటి అభ్యంతరం ఉండాల్సిన అవసరంలేదు.

పాలకులు మరియు ప్రభుత్వాలు ప్రతిపాదిస్తున్న కార్మిక సంస్కరణలు ఇప్పటికే కార్మికులకు చట్టపరమైన భద్రతను బలహీనం చేస్తున్నాయి. కనీస వేతనాల దృక్పథానికున్న చట్టబద్ధపునాదినే రద్దుచేసే ఏ ప్రయత్నమైనా, మనదేశ కార్మికవర్గం యొక్క జీవితాలను నాశనం చేస్తుంది.

కార్మికులు ఏవిధంగా మానవులుగా సైతం చూడబడటంలేదో, వారు మార్కెట్ ఆర్థికవ్యవస్థ అదుపులో సరుకులుగా ఏవిధంగా పరిగణింపబడుతున్నారో ఈ విషయాలు స్పష్టం చేస్తున్నాయి. ఆ కారణంగానే పాలకులు, పారిశ్రామిక యాజమాన్యాలు చట్టం నిర్దేశించిన, న్యాయసమ్మతమైన కనీస వేతనాలను నిర్ధారించటానికి నిరాకరిస్తున్నారు.


మనదేశ కార్మికోద్యమం, కార్మికులు – కనీసవేతన చట్టాన్ని రద్దుచేసే మన పాలకుల ప్రయత్నాలను వ్యతిరేకించి ఐక్యంగా నిలకడైన పోరాటాల్ని సాగించటంతోపాటు, రాబోయేరోజుల్లో జీవన వేతనాల సాధనకోసం నిశ్చయాత్మకంగా పోరాడాలి. ✸

రైతులకు అరాకొరగా పంట రుణాలు

రైతాంగానికి పంట రుణాలు ఇవ్వటంలో పాలకుల మాటలకు పొంతనే వుండటంలేదు. ఏ సంవత్సరంలో కూడా ప్రకటించిన పంట రుణాలు పూర్తిగా ఇవ్వటంలేదు. ఒక సంవత్సరంలో ఇస్తామన్న మొత్తం రుణాల్లో మిగిలిన వాటిని కలిపి మరుసటి సంవత్సరం ఎక్కువ పంట రుణాలు కేటాయించినట్లు పాలకులు ప్రచారం చేసుకొంటున్నారు. ఇప్పటికీ కౌలు రైతులకు కంటితుడుపు రుణాలు కూడా అందటంలేదు. ప్రతి వ్యవసాయ సీజన్‌కు ముందు కౌలురైతులందరికీ రుణాలు అందిస్తామని ఆర్భాటపు ప్రచారం మాత్రం చేస్తున్నారు. ప్రాధాన్యతా రంగాలకు ఇచ్చేవాటిల్లో 18 శాతం పంటరుణాలుగా ఇవ్వాలని రిజర్వుబ్యాంక్ ఆదేశాలు వున్నా, అది ఎప్పుడూ అమలు జరగలేదు. 17శాతం రైతులకు మించి రుణాలు అందటంలేదు. ఫలితంగా అత్యధిక రైతులు ప్రైవేట్ వడ్డీవ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.

ఈ వ్యవసాయ వార్షిక సంవత్సరంలో ఎప్పుడూ లేనివిధంగా వ్యవసాయరంగానికి 68 వేలకోట్ల రుణాలు యిచ్చేందుకు బ్యాంక్‌లను ఒప్పించిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిదేనని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పుకొన్నారు. ఖరీఫ్ పంట రుణాలు 36,580 కోట్లుగా ప్రకటించినా అది పూర్తిగా అమలుజరగలేదు. ఖరీఫ్ సీజన్ ముగిసినా కేటాయించిన రుణాలు 29,507 కోట్లు మాత్రమే. అంటే 7,073 కోట్లు ఇవ్వాల్సిన రుణాలు మిగిలివున్నాయి. వ్యవసాయ టర్మ్ రుణాలు 1,502 కోట్లు లక్ష్యంగా పెట్టినా యిచ్చింది 5,970 కోట్లు మాత్రమే. వ్యవసాయ పంటరుణాలు, టర్మ్‌రుణాల మొత్తం లక్ష్యం 48,082 కోట్లు కాగా 35,039 కోట్లు మాత్రమే మంజూరుచేశారు. లక్ష్యంలో 13,039 కోట్లు తక్కువగా వుంది.

రాష్ట్రప్రభుత్వం రైతుల వ్యవసాయ రుణాలను మాఫీచేస్తానని చెప్పటంతో అత్యధిక రైతులు బ్యాంక్ రుణాలు చెల్లించలేదు. రుణాల చెల్లింపు కాలపరిమితి దాటిపోవటంతో అపరాధపు వడ్డీని బ్యాంక్‌లు రుణాలకు వర్తింపచేశాయి. ఫలితంగా అసలుకు మించి వడ్డీ పెరిగింది. ప్రభుత్వం చేస్తానంటున్న రుణమాఫీ వడ్డీకే సరిపోకపోవటంతో రుణాలు చెల్లించనివారుగా రైతులు మిగిలిపోయారు. రైతులు రుణాలు చెల్లించలేదు కాబట్టి తిరిగి వారికి రుణాలు ఇవ్వబోమని బ్యాంక్ అధికారులు చెబుతున్నారు. రైతుల పరిస్థితి రెంటికి చెడ్డరేవడిలా తయారైంది. కౌలురైతులకు రుణాల మంజూరు అన్నది ఎక్కడి గొంగళి అక్కడే అన్న చందంగానే వుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 5.76 లక్షలమంది రైతులకు రుణ అర్హతకార్డులు జారీచేయగా 41,729 మందికి మాత్రమే రుణాలు అందాయి. కృష్ణా, గుంటూరు, ప్రకాశంజిల్లాల్లో ఒక్క కౌలురైతుకి కూడా బ్యాంక్‌ల నుండి రుణాలు అందలేదు. వ్యవసాయ పంటల రుణ లక్ష్యం అమలుతీరు ఎలా వుందీ దీన్ని గమనిస్తే అర్థమౌతుంది. ✸



సోవియట్ యూనియన్‌లో స్త్రీల పరిస్థితి

రచన : **జి.యన్. సెరిబ్రెన్నికోవ్**

అనువాదం : **తోలేటి జగన్మోహనరావు**

ప్రచురణ : **తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్**

ప్రతులకు : **మైత్రీబుక్‌హౌస్**

28-9-1, జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్ రోడ్, విజయవాడ - 2

వెల : **రూ. 120/-**

సింగూరు భూసేకరణపై సుప్రీంకోర్టు తీర్పు వాస్తవంగా రైతుల విజయమేనా?

2006లో సిపిఐ(ఎం) నాయకత్వంలోని పశ్చిమబెంగాల్ రాష్ట్రప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి, ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పనలపేరిట హుగ్లీ జిల్లాలోని సింగూరు ప్రాంతంలో 1300 మంది రైతుల నుండి దాదాపు వెయ్యి ఎకరాల సారవంతమైన భూములను సేకరించింది. ఈ భూములను నానో కార్ల ఫ్యాక్టరీ పెట్టటానికి టాటా మోటార్స్ లిమిటెడ్ కంపెనీకి లీజుకిచ్చింది.

ఈ భూసేకరణకు గురైన రైతులంతా, ప్రభుత్వ భూసేకరణను ప్రతిఘటించి, తమ భూములను తాము తిరిగి దక్కించుకోవడానికి తీవ్రంగా పోరాడారు. మరోవైపున సిపిఐ(ఎం) ఆధ్వర్యంలోని నాటి రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున పోలీసు బలగాలను ప్రయోగించి అణచివేతతో ఈ భూమిని సేకరించింది. తమ భూములను తిరిగి దక్కించుకోవటానికి ఆందోళనచేస్తున్న రైతుల ఎడల సిపిఐ(ఎం)కు చెందిన సాయుధ కార్యకర్తలు సైతం నిర్దాక్షిణ్యంగా వ్యవహరించారు.

సింగూరు రైతుల ఈ ప్రతిఘటనోద్యమం అధికార సిపిఐ(ఎం)కు, ప్రతిపక్షంలోనున్న తృణమూల్ కాంగ్రెస్‌కు మధ్య రాజకీయ పెనుగులాటగా మారి, ఎన్నికల క్రమంలో ఒక ముఖ్యమైన పాత్ర నిర్వహించి తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతాబెనర్జీ పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో ప్రభుత్వాధికారంలోకి రావడానికి తోడ్పడింది.

ఓవైపున సింగూరు రైతుల ఆందోళన, భూసేకరణ వ్యతిరేక ప్రతిఘటనకు ఓ చిహ్నంగా మారగా, మరోవైపున మమతాబెనర్జీ రాష్ట్రంలో పాలనాధికారంలోకి రావటానికి దీనిని ఓ సాధనంగా చేసుకోవటంతోపాటు, తనను తాను సింగూరు రైతుల సమస్యలపై పోరాడిన యోధురాలిగా ప్రచారం గావించుకుంది. సింగూరు రైతుల ఆందోళన సిపిఐ(ఎం) పార్టీని పూర్తిగా ప్రజలకు దూరంచేసి, వేర్లతోసహా దాని పార్లమెంటరీ మూలాలను కెళ్ళగించి భవిష్యత్తులో ప్రభుత్వాధికారంలోకి తిరిగి రాగలమనే ఆశలను వమ్ముచేసింది.

అయితే, సింగూరు రైతుల ప్రతిఘటన లేవనెత్తుతున్న ప్రశ్నకు సమాధానం లేకుండా పోయింది. వ్యవసాయాధారితమైన మనదేశంలో రైతాంగ జీవనాధారమైన భూములను ప్రభుత్వాలు 'ప్రజా ప్రయోజనం' లేదా 'ప్రజోపయోగం' పేరున-అది కూడా వ్యక్తుల ప్రైవేటు ఆస్తిహక్కును పవిత్రమైందిగా భావించే రాజ్యాంగం, చట్టం ఆ హక్కును పరిరక్షిస్తాయని చెప్పబడుతున్న ఈ వ్యవస్థలో-ఏ విధంగా సేకరిస్తాయనే ప్రశ్నకు సమాధానం లేదు.

ఈ రకమైన మౌలిక స్వభావం కల్గిన, విధాన పరమైన ప్రశ్నలకు మన ఉన్నత న్యాయస్థానాలు (హైకోర్టులు లేదా సుప్రీంకోర్టు) సమాధానమీయవు. ఈ విధమైన వివాదాలు ఎక్కడైనా ఉత్పన్నమైతే, ఆ కేసులలోని చట్టపరమైన 'అనుకూలతల' ప్రకారం ఉనికిలోవున్న చట్టం మరియు అంతకుముందున్న ప్రమాణాల ఆధారంగా ఆ వివాదాలను పరిష్కరించ బూనుకుంటాయి.

కలకత్తా హైకోర్టు డివిజన్‌బెంచ్ సింగూరు భూసేకరణను సమర్థించింది. "ఉద్యోగ ఉపాధి అవకాశాలను సృష్టించేందుకు, ఆ ప్రాంత సామాజిక - ఆర్థిక అభివృద్ధి అనే ప్రజోపయోగంకొరకు మాత్రమే ఆ భూముల సేకరణ జరిగింది మినహా మరే ప్రైవేటు కంపెనీ ప్రయోజనాలను నెరవేర్చేందుకు ఉద్దేశించింది కాదని" డివిజన్ బెంచ్ ఆనాటి తన తీర్పులో ప్రకటించింది.

సేకరించిన భూమిలో టాటాకంపెనీ కొన్ని నిర్మాణాలను చేపట్టినప్పటికీ, భూసేకరణకు వ్యతిరేకంగా తీవ్ర ప్రతిఘటన ముందుకొచ్చిన కారణంగా, ఆ కంపెనీ అక్కడ నిర్మించతలపెట్టిన నానో ప్రాజెక్టును గుజరాత్ రాష్ట్రంలోని సనంద్‌కు తరలించింది. అక్కడ గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం నుండి ఆ కంపెనీ మరిన్ని సౌకర్యాల్ని పొందగలిగింది.

కాగా, కలకత్తా హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయగా, 8 సం॥ల తర్వాత అనగా, 2016 ఆగస్టు 31న సుప్రీంకోర్టు తన తీర్పును వెలువరించింది. ఈ తీర్పు వెలువడిన తర్వాత 12 వారాలలో సింగూరులో రైతులనుండి సేకరించిన భూములను వారికి తిరిగి అప్పగించాలని సుప్రీంకోర్టు తన తీర్పులో ఆదేశించింది. సుప్రీంకోర్టు బెంచ్‌లోనున్న ఇరువురు న్యాయమూర్తుల మధ్య కేసులోని కొన్ని అంశాలపై విభేదాలున్నప్పటికీ, విడివిడి తీర్పులిచ్చినప్పటికీ, ఆ భూముల సేకరణ ప్రక్రియలో పొరపాట్లున్నాయన్న ఏకాభిప్రాయంతో, దీనినంతా చట్టవిరుద్ధమైనదిగా ప్రకటించారు.

సింగూరు రైతులలో ఈ తీర్పు సంతోషాతిరేకాలను నింపింది. ప్రత్యేకించి, సింగూరు రైతుల సమస్యలపై పోరాడిన యోధురాలిగా ప్రచారంగావించుకొన్న మమతా బెనర్జీకి ఈ తీర్పు చాలా సంతోషాన్ని కలుగజేసింది.

ప్రస్తుత అసమాన, దోపిడీవ్యవస్థ పక్షాన నిలిచే 'మేధావులు', 'నిపుణులు' కొందరు బయలుదేరి ఈ తీర్పును రైతాంగ విజయంగా అభివర్ణించారు. అంతేగాక, ఈ తీర్పు భవిష్యత్తులో రాష్ట్రప్రభుత్వాల భూసేకరణపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుందని వారు పేర్కొన్నారు.

సిపిఐ(ఎం) పార్టీ మొఖం వేళ్ళాడేసుకున్నప్పటికీ పారిశ్రామికంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు, తద్వారా ఉద్యోగావకాశాలను పెంచేందుకు ఆనాటికి ఉనికిలో వున్న '1894 భూసేకరణ చట్టం' ప్రకారం సింగూరు భూములను సేకరించామని, ఇది పార్టీయొక్క రాజకీయ తప్పిదంగా రుజువైందని పేర్కొంటూనే తన చర్యను సమర్థించుకుంది.

వాస్తవానికి పారిశ్రామిక, వ్యాపార రంగాలకు భూములను సులభతరంగా అందించేవిధంగా, నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానాల కనుగుణంగా '1894 నాటి భూసేకరణ చట్టాన్ని' ఎప్పటికప్పుడు మార్పులు చేసుకుంటూ వస్తున్నారు. కేంద్రప్రభుత్వమూ మరియు వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు వారి వారి అవసరాలకనుగుణంగా భూసేకరణ చట్టాన్నీ సవరించారు. ఆంధ్రప్రదేశ్‌లో భూసమీకరణ చట్టంలాగా ప్రత్యేక చట్టాలను సైతం చేశారు.

సింగూరులో రైతుల ప్రతిఘటన తర్వాత కూడా, వివిధ రాష్ట్రాలలో ఆయా ప్రభుత్వాలు తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించి, రైతుల భూములను బలవంతంగా సమీకరించాయి. 'ప్రజాభిప్రాయ సేకరణ' వంటి బూటకపు తంతులను సైతం జరగనీయకుండా పోలీసు బలగాలు మోహరించి రైతులను భయభ్రాంతుల్ని చేస్తూ వచ్చినప్పటికీ, తమ భూములను బలవంతంగా గుంజివేసుకోవటానికి వ్యతిరేకంగా రైతాంగం నిరంతరాయ ఆందోళనలు సాగిస్తూ వస్తున్నారు.

ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌లో, రాజధాని నిర్మాణం పేరున, పారిశ్రామిక అభివృద్ధిపేరున వేలాది ఎకరాల రైతాంగ భూములను రాష్ట్ర ప్రభుత్వం బలవంతంగా గుంజివేసుకుంది. భూములు ఇవ్వటానికి నిరాకరించిన రైతులను పోలీసులూ, ప్రభుత్వమూ అధికారంలోనున్న పాలక రాజకీయ పార్టీ కార్యకర్తలూ బెదిరింపులకు గురిచేసి భూములను 'సమీకరించారు'. వేలాదిమంది పేద రైతాంగాన్ని, భూమిలేని నిరుపేద వ్యవసాయ కూలీలను ఒక పద్ధతి ప్రకారం వారి జీవనాధారాన్ని కోల్పోయేట్లుచేసి, మరో జీవనోపాధి చూపకుండా, ఎలాంటి నష్టపరిహారమూ చెల్లించకుండా ఎవరైనా ఈ అన్యాయాన్ని ఎత్తిచూపి ప్రశ్నిస్తే వారిపై 'ప్రభుత్వ వ్యతిరేక' లేక 'అభివృద్ధి వ్యతిరేక' ముద్రలు వేసి వారిని వేధింపులకు గురిచేస్తున్నారు.

తాజా ప్రభుత్వ అధ్యయనం ప్రకారమే, గత సంపత్సర కాలంలో దేశం మొత్తంమీద ఆందోళనల్లోకి వస్తున్న రైతాంగం సంఖ్య 300 శాతం పెరిగిందని తెలుస్తోంది. నయా ఉదారవాద పెట్టుబడిదారీ ఆర్థిక విధానాలైన 'పారిశ్రామికాభివృద్ధి' 'భూసేకరణ'ల రథచక్రాలలో నలిగిపోతున్న రైతాంగంయొక్క తీవ్ర నిస్సహాయ దుస్థితికి ఈ పరిస్థితి అద్దం పడుతోంది.

అయితే, 'పారిశ్రామికాభివృద్ధి మరియు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన' పేరిట ధ్వంసం చేయబడుతున్న రైతాంగాన్ని ఆదుకోవడానికి ఈ న్యాయస్థానాలేవీ ముందుకు రాలేదు. పైగా, ఇందుకు భిన్నంగా దరఖాస్తుదారుల 'లోకోస్టాండీ' (గుర్తింపు హోదా) స్థితిని లేవనెత్తి, 'ప్రపంచస్థాయి రాష్ట్ర రాజధాని' నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం బలవంతంగా గుంజుకున్న సారవంతమైన భూములకు చెందిన రైతాంగం తరఫున దాఖలు చేసిన దరఖాస్తులను కనీసం వినను కూడా వినకుండానే సుప్రీంకోర్టు బెంచ్ తిరస్కరించింది. భూసేకరణలపై ఉన్నత న్యాయస్థానాల తీర్పుల స్వభావమెలా వుందనే దానికి ఇదో ఉదాహరణ.

గాంధీ జయంతి మరియు లాల్‌బహదూర్‌శాస్త్రిల జయంతికి ఒక్కరోజు ముందుగా 2016 అక్టోబర్ 1న జార్ఖండ్ రాష్ట్రం, హజారీబాగ్ పట్టణానికి 30 కి॥మీ దూరంలోని బర్కాగావ్‌లోని దోదికలా వద్ద చోటుచేసుకున్న సంఘటన, రాష్ట్రాల బలవంతపు భూసేకరణ బాధితులైన రైతులకు ఎంతటి అన్యాయం జరుగుతుందనే దానికి తాజా ఉదాహరణ.

2006లో ఆ ప్రాంతంలోని 28 గ్రామాలలో బొగ్గుగనుల తవ్వకాల కోసం 8 వేల ఎకరాల భూములను సేకరించేందుకు ఎన్‌టిపిసి పూనుకుంది. ఆసియా ఖండంలో పెద్దదైన ఓ బొగ్గుగనుల ప్రాజెక్టు కోసం చేపట్టిన ఈ భూసేకరణ ప్రక్రియలో, ఆదివాసుల హక్కుల చట్టం - 2006 ప్రకారం గ్రామసభల ఆమోదం తీసుకోకుండానే, చిన్న రైతాంగం నుండి ఎన్‌టిపిసి భూములను సేకరించింది. ఎన్‌టిపిసి సేకరించిన ఈ భూములు జార్ఖండ్ రాష్ట్రంలోనే అత్యంత సారవంతమైనవి. కానీ ఎన్‌టిపిసి, ఆ భూములను కోల్పోయిన రైతులకు మార్కెట్ ధరకు నాలుగురెట్లు చెల్లించబడుతుందనే చట్టపరమైన ఆదేశాలకు భిన్నంగా నామమాత్రమైన పరిహారాన్ని మాత్రమే చెల్లించింది.

భూసేకరణ, పునరావాస చట్టం - 2013 ప్రకారం చట్టం నిర్దేశించిన పరిహారాన్ని డిమాండ్ చేస్తూ బాధిత రైతాంగం - పాక్రి బర్వాధ్‌కోల్ మైనింగ్ ప్రాజెక్టు కోసం ఎన్‌టిపిసి చేపట్టిన భూసేకరణను వ్యతిరేకిస్తూ అక్టోబర్ 1న ఓ భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. రాపిడ్ యాక్షన్‌ఫోర్స్‌కు చెందిన సాయుధ పోలీసులు వారిపై లాఠీఛార్జీకి పాల్పడి, ఆపై కాల్పులు సాగించి ఆందోళనకారులు కూడా కాని దోవనపోయే నలుగురిని బలిగొన్నారు. ఆ ప్రాంతాన్నంతా పోలీసు దిగ్బంధంలో వుంచారు. భూసేకరణ బాధిత రైతాంగానికి రాజ్యం కల్పిస్తున్న న్యాయం ఈ విధంగా వుంది! సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ఏ తీర్పులూ బాధిత రైతాంగాన్ని ఆదుకునేందుకు తోడ్పడలేదు. బలవంతంగా భూములను సేకరిస్తున్న ప్రభుత్వం రైతుల ఎడల అనుసరిస్తున్న వాస్తవచిత్రం ఈ విధంగా వుంది.

ప్రస్తుత సుప్రీంకోర్టు తీర్పు కూడా - 'ప్రజా ప్రయోజనం' లేక 'అభివృద్ధి' పేరిటగానీ భూ యజమాని యొక్క ఆమోదం లేకుండాగానీ ప్రభుత్వాలు రైతుల భూములను సేకరించటాన్ని ఆమోదించరాదనే విధానం లేదా సూత్రంపై ఆధారపడి ఇచ్చింది కాదు. కేవలం నిర్దేశిత ప్రాంతంలో భూసేకరణ ప్రక్రియను అమలు చేసిన పాలనా అధికార యంత్రాంగం, సంబంధిత చట్టాన్ని సక్రమంగా వర్తింపజేయకపోవటం కారణంగా మాత్రమే ఈ తీర్పునిచ్చినట్లు పేర్కొంది. అంటే, సంబంధిత చట్టాన్ని పాలనా యంత్రాంగం సక్రమంగా అనువర్తింపజేసినట్లయితే, రాష్ట్ర ప్రభుత్వ భూసేకరణకు ఎలాంటి అభ్యంతరంలేదని చెప్పటమే కదా!? న్యాయమూర్తులు కూడా కేవలం 'రైతుల హక్కుల ఉల్లంఘనల' సమస్యలను, 'ప్రజా ప్రయోజన' సమస్యలను మేధో జిజ్ఞాసపరమైన దృష్టితో చర్చించి, తర్కించి, వారి విడివిడి తీర్పులలో పేర్కొన్నారు. కానీ, సాంకేతికంగా చట్టపరమైన పద్ధతుల అమలులో, ప్రక్రియాపరంగా అనువర్తింపజేయటంలో జరిగిన తప్పిదాల విషయంలో ఏకాభిప్రాయంతో వున్నారు. రైతుల నుండి భూములను సేకరించి, వారిని వారి జీవనాధారాల నుండి దూరం చేయటానికి సంబంధించిన చట్టంలోని అంశాలను వారు ప్రశ్నించటంగానీ లేదా దానిపై చర్యలు తీసుకోవటంగానీ చేయలేదు. ప్రభుత్వాలు చేపడుతున్న భూసేకరణ విధానాన్ని ఈ తీర్పు రద్దు చేయలేదు.

కనుక 'భూసేకరణ చట్టం - 2013' ప్రకారం ప్రభుత్వాలు బలవంతంగా సేకరిస్తున్న భూములకు చెందిన రైతాంగాన్నికానీ, లేక కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు గొప్పగా కీర్తిస్తున్న ఇదే తరహాలోని ఆంధ్రప్రదేశ్ భూసమీకరణ చట్టంయొక్క బాధితులైన రైతాంగాన్నికానీ - సింగూరు రైతుల భూసేకరణ అంశంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఉద్ధరించబోతున్నదని ఎవరూ భ్రమ పడాల్సిన అవసరంలేదు.

కనుక, విశాల అర్థంలో టాటావారి నానో ప్రాజెక్టు కోసం లీజుకిచ్చిన భూములను తిరిగి బాధిత రైతులకు అందజేయటాన్ని సుగమంచేసిన సింగూరు భూసేకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రైతాంగ విజయంగా పేర్కొనలేం. ఇది ఒక పరిమిత ప్రయోజనాన్ని కల్గించే పరిణామం మాత్రమే! నానో ఫ్యాక్టరీ నిర్మాణానికి సంబంధించిన విస్తృత నిర్మాణ పనులను ప్రారంభించి, వదిలేసిన ఆ భూములను తిరిగి వ్యవసాయయోగ్యంగా మలుచుకొనేందుకు బాధిత రైతాంగం మరింతగా శ్రమించాల్సి వస్తుంది.

దేశవ్యాపితంగానున్న రైతాంగం తమ భూముల పరిరక్షణకోసం పోరాట స్ఫూర్తితో ఐక్యంగా నిలవటం ద్వారానే, తమ భూములను తాము కాపాడుకోగలుగుతారు. ✸

పాలకులు.... (మొదటిపేజీ తరువాయి)

కార్యకర్తలపై 20-10-16న పోలీసులు నిర్బంధం ప్రయోగించారు. అనేకమందిని అరెస్టు చేశారు. విచక్షణారహితంగా కొట్టారు.

కృష్ణాజిల్లా - మచిలీపట్నం తీరప్రాంత గ్రామాలలో పోర్టు, 'మడ' పేరున 30 వేల ఎకరాలపైగా భూముల 'సమీకరణకు' ప్రభుత్వం చర్యలను త్వరితం చేసింది. దీనిని వ్యతిరేకిస్తూన్న బాధిత గ్రామాల ప్రజల అసంతృప్తి, ఆందోళనలను సామ, దాన, బేధ, దండోపాయాలతో అణచివేస్తున్నారు.


శ్రీకాకుళంజిల్లా - కొవ్వాడలో పెనువిధ్వంసకరమైన అణువిద్యుత్‌కేంద్ర నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్న ప్రజలపై నిర్బంధాన్ని అమలుచేస్తూ ఆ ప్రాజెక్టు నిర్మాణ చర్యలను పాలకులు వేగవంతం చేస్తున్నారు.

విజయనగరం జిల్లా - భోగాపురం విమానాశ్రయ నిర్మాణానికి పచ్చని పంటపొలాల్ని ఇవ్వబోమని గట్టిగా ఎదురు నిలిచిన ప్రజలపై నిర్బంధచర్యలకు పాల్పడి, విమానాశ్రయ నిర్మాణ సన్నాహాలను నిలిపివేయబోమని ప్రకటించారు.

సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థినుల కనీసపాటి సమస్యలను పరిష్కరించమని విన్నవించటానికి వెళ్ళిన పిడిఎస్ఓ విద్యార్థి నాయకులను ప్రకాశంజిల్లా కలెక్టరు దగ్గరుండి అరెస్టు చేయించటం;

చట్ట ప్రకారం వ్యవహరించని బాపట్ల సిఐని నిలదీసి, అతనిపై కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేసినందుకు కక్షగట్టిన పోలీస్ యంత్రాంగం గుంటూరు జిల్లా పొన్నూరులో డా॥ రాజారావుపై అక్రమకేసులు మోపి, భారీఎత్తున పోలీసు బలగాలను మోహరించి, 144వ సెక్షన్ ప్రయోగించి, అరెస్టులు సాగించి భీతావహ వాతారణాన్ని కలిగించటం;

గిరిజనుల జీవనాధారాన్ని దెబ్బతీసే విజయనగరం జిల్లా బడిదేవరకొండ గ్రానైట్ తవ్వకాలకు ప్రభుత్వం ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలన్నందుకు రైతుకూలీ సంఘం జిల్లా నాయకులను అరెస్టులు సాగించటం - వంటి అనేకానేక సంఘటనలు పాలక ప్రభుత్వం నానాటికీ అణచివేతపై ఆధారపడి మాత్రమే పాలన సాగించగలిగిన పరిస్థితిలో వుందని తెలియపరుస్తున్నాయి. ప్రజలు - ప్రజాతంత్రవాదులు, పౌర, ప్రజాస్వామిక హక్కులసంఘాలు, ప్రజల కనీసపాటి ఆవేదనను వ్యక్తం చేయటానికి కూడా అవకాశాలను మృగ్యం చేస్తున్న ప్రభుత్వవిధానాలను ఎలుగెత్తి ఖండించాలి. ప్రజాస్వామిక హక్కుల చైతన్యాన్ని పెంపొందించే బలమైన ప్రజాస్వామిక హక్కుల ఉద్యమ నిర్మాణానికి పూనిక వహించాలి. ✸



సిపిఐ(ఎం-ఎల్) ప్రచురణ

సిద్ధాంత, రాజకీయ, నిర్మాణ, ఆచరణ రంగాలలో

నిరంతర పోరాటాల నుండే విప్లవపార్టీ నిర్మాణం సాధ్యం

పేజీలు : 80 వెల : రు. 30/-

కాపీలకు : **మైత్రీబుక్‌హౌస్,**

జలీల్ వీధి, కార్‌ల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2

నల్లధనం వెలికితీత కోటలు దాటే మాటలు-గడపలు దాటని చేతలు

దేశంలో దాగిన నల్లధనం గురించి, దానిని వెలికితీయటం గురించి దశాబ్దాలుగా చర్చ సాగుతూనే వుంది. ముఖ్యంగా గత దశాబ్దకాలంలో యుపిఏ, ఎన్‌డిఏ కూటములు సార్వత్రిక ఎన్నికల ప్రచార సందర్భంగా నల్లధనం అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ వస్తున్నాయి. రెండున్నర దశాబ్దాల సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల అమలుతో, అవినీతి మోతాదు, కుంభకోణాల సంఖ్య పెరిగిపోతూ లక్షలకోట్ల రూపాయల ప్రజాధనం లెక్కకు రాకుండాపోతున్న తీరుపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమౌతోంది. ఎన్నికల్లో విజయం సాధించి అధికారంలోకి వస్తే దేశ, విదేశాల్లోని నల్లధనాన్ని వెలికి తీసుకువస్తామని ఎవరికి వారు గప్పాలు గొడ్తూ వస్తున్నారు. 2014 ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి వస్తే విదేశాల్లో పోగుబడిన నల్లధనాన్ని వెలికితీసి ప్రతి భారతీయుడి బ్యాంకు ఖాతాలో 15 లక్షల రూ।జమ చేస్తామని నరేంద్రమోదీ వాగ్దానం చేశాడు. బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ అధికారం చేబట్టి రెండున్నర ఏళ్ళు గడిచిపోతున్నా, కమిటీలు, వాదనలు, న్యాయస్థానాలు, విచారణలు మినహా నల్లధనం వెలికితీత అంశం 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' చందంగా మిగిలింది.

విదేశాలకు తరలిపోయి, స్విస్‌బ్యాంకుతో సహా వివిధ విదేశీ బ్యాంకుల్లో మూల్గుతున్న నల్లధనం విలువ 70 లక్షలకోట్ల రూ।పై మాటేనని వివిధ అంచనాలు తెలుపుతున్నాయి. విదేశాలలో నల్లధనం పోగుపడటం ప్రధానంగా రెండు విధాలుగా సాగుతోంది. ఒకటి-మనదేశంలో తయారైన ఉత్పత్తులను, సరుకులను లేదా సేవలను ఇతర దేశాలకు ఎగుమతిచేసి, వాస్తవంగా అమ్మిన ధరకంటే లెక్కలలో తక్కువ ధరను చూపటం; రెండవది-ఇతర దేశాలనుండి దిగుమతి చేసుకున్న సరుకులకు, ఉత్పత్తులకు వాస్తవంగా చెల్లించిన ధరకంటే లెక్కలలో ఎక్కువ ధరను చూపటం. పై రెండు మార్గాలలో ఎగుమతి, దిగుమతులలో అక్రమాలద్వారా మిగుల్చుకుంటున్న ఈ 'నల్ల' ధనాన్నంతా విదేశీ బ్యాంకుల్లో నిల్వ చేస్తున్నారు. ఈ రూపంలో విదేశాలకు సంపద తరలింపు-మొత్తంగా విదేశాలకు నల్లధనం తరలింపు మార్గాలలో 77.8 శాతంగా వుందని గ్లోబల్ ఫైనాన్షియల్ ఇంటెగ్రిటీ సంస్థ గత సంవత్సరం తన అధ్యయనంలో తెలిపింది. ఇలా నల్లధనం తరలింపు ప్రతి ఏడాదీ 9.4 శాతం చొప్పున పెరుగుతూ వుందని ఆ అధ్యయనం తెలియజేసింది.

ఇక, దేశంలో పన్నుల ఎగవేతద్వారా, ఆదాయాన్ని తగ్గించిచూపటం ద్వారా, అక్రమార్జనలద్వారా ప్రభుత్వ ఖాతాలలో వెల్లడికాకుండా బడాపెట్టుబడిదార్లు, బడా వాణిజ్యవేత్తలు దాచివుంచిన నల్లధనం 30 లక్షలకోట్ల రూ। వుంటుందని ప్రభుత్వాల అంచనాలే తెలియ జేస్తున్నాయి.

విదేశీ బ్యాంకులలో నిల్వవుంచిన నల్లధనాన్ని వెలికితీయటానికి, బ్యాంకుల గోప్యత, ఆయా దేశాలలో అమలులోవున్న చట్టాలు ఆటంకంగా వున్నాయని చెప్తున్న ప్రభుత్వం, దేశంలో తమ చట్టాలు, తమ నిఘా, పాలనా యంత్రాంగాల సహాయంతో అక్రమంగా మేటలు వేస్తున్న లక్షలకోట్ల నల్లధనాన్ని ఎందుకు బయటపెట్టలేక పోతున్నది? జవాబు స్పష్టమే. బడా బూర్జువా, భూస్వామ్య వర్గాలకు ప్రాతినిధ్యం వహించే, సామ్రాజ్యవాద ప్రభువుల అడుగులకు మడుగులొత్తే దళారీ పాలకులు - బడా పెట్టుబడిదారుల, బడా వాణిజ్యవేత్తల నల్లధనం జోలికి పోవటానికే సాహసించరు. కనుక, తాము అధికారంలో వున్నంతకాలం కంటి తుడుపు చర్యలతో ప్రజలను మభ్యపుచ్చటం, ప్రతిపక్షంలో వున్నపుడు అధికారంలోనున్న పాలకపార్టీ నల్లధనాన్ని వెలికి తీయటంలో విఫలమైందని గొంతెత్తటం వారికి పరిపాటైంది.

విదేశాలలో నిల్వయున్న రూ। 70 లక్షల కోట్ల, స్వదేశంలో అక్రమ నిల్వలైన రూ। 30 లక్షలకోట్ల నల్లధనాన్ని వెలికితీస్తానని బీరాలు పలికిన బిజెపి, ప్రజల్ని వంచించటానికి మరోసారి పూనుకుంది. విదేశాల్లోవున్న నల్లధనాన్ని తేల్చి చెప్పాలంటూ గత ఏడాది ప్రకటించిన పథకంలో కేవలం మూడువేల కోట్ల రూపాయలను మాత్రమే రాబట్టగలిగింది.

ఇక, దేశంలో ఆదాయపు పన్నుశాఖకు లెక్కల్లో చూపని ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా ఎగ్గొట్టిన నల్లధనాన్ని వెలికితీయటానికి బిజెపి ప్రభుత్వం సుతిమెత్తనైన మార్గాన్ని ఎంచుకుంది. నిర్దిష్టకాల వ్యవధిలో నల్లధన నిల్వలను స్వచ్ఛందంగా బయట పెట్టిన వారికి జరిమానాతో సరిపెడతామని, వారి పేర్లు వెల్లడి కానీయబోమని పలు హామీలతో వారిని దేబిరించింది. పన్నులు ఎగవేసిన వారిని, ఆదాయాలను తగ్గించి చూపినవారిని 'ఆదాయ వెల్లడి పథకం-2016' ద్వారా ముందుకు రావలసిందిగా బతిమలాడుకుంది.

మొత్తానికి, ఈ పథకం గడువు ముగిసిన-2016 సెప్టెంబర్ 30 నాటికి-64 వేలమంది ఆస్తిపరులు లెక్కకురాని 65,250 కోట్ల రూ।నల్లధనాన్ని బయట పెట్టారు. అంటే సగటున ఒక్కో వ్యక్తీ ఒక కోటి రూ।।నల్లధనాన్ని మాత్రమే వెల్లడిచేశాడన్నమాట! ఈ ఆదాయంపై ప్రభుత్వం విధించిన పన్ను, మరియు జరిమానాల ద్వారా ప్రభుత్వ ఖజానాకు షుమారు 30వేల కోట్ల రూ।జమ అవనున్నాయని ఆర్థికమంత్రిత్వ శాఖ ప్రకటించింది. (మిగతా 35 వేల కోట్లకుపైగా డబ్బు సంబంధిత వ్యక్తులకే చెంది, బహిరంగ చలామణిలోకి వస్తుంది) ఈ నిధులను దేశంలోని మౌలిక, గ్రామీణ రంగాలకు వెచ్చించనున్నామని ప్రకటిస్తూ తమ వల్లనే ఇంతటి ఘనకార్యం సాధించ బడిందని బిజెపి పాలకులు పోజుపెడతున్నారు.

పంటలు సరిగా పండక, అప్పుచెల్లించలేని నిస్సహాయ స్థితిలోనున్న బక్కరైతులపై ప్రతాపం చూపించగలిగిన ప్రభుత్వ, పాలనాధికార యంత్రాంగం, ఆతనికున్న చెంబూ తపేలాలను బయటవేసి, సెంటు, కుంట భూమిని సైతం జప్తుచేయగలిగిన బ్యాంకులు, పాలకులు-ఆస్తిపర, ధనిక వర్గాల జోలికి వెళ్ళాలనేసరికి కాలుచేయీ ఆడకపోవటం వారి వర్గ స్వభావాన్ని తెలియజేస్తోంది. అవినీతి, కుంభకోణాల్లో కోట్లకు పడగలెత్తిన అక్రమార్జనాపరులు, భారీ బ్యాంకు రుణాలను చెల్లించక పారుబాకీల క్రింద చెల్లవేయించు కుంటున్న బడాపరిశ్రమాధిపతులు, వేలకోట్ల రూ।ల పన్నులను ఎగవేసి, పైగా అంతర్జాతీయ న్యాయస్థానాల్లో పరువునష్టం వ్యాజ్యాలు నడుపుతోన్న బహుళజాతి కంపెనీల, వారి తైనాతీల ఆస్తుల పరిరక్షణకే కంకణం కట్టుకొన్న దళారీ పాలకులు ఇంతకుమించిన చర్యలు చేపడ్తారనుకోవటం అత్యాశే అవుతుంది.

గతంలో యుపిఏ ప్రభుత్వ కాలంలో, చిదంబరం ఆర్థికమంత్రిగా నల్లధనం వెల్లడికోసం ప్రకటించిన ఆదాయ వెల్లడి పథకంద్వారా, ఆనాటి ప్రభుత్వం కేవలం 10,100 కోట్ల రూ। నల్లధనాన్ని మాత్రమే వెల్లడి చేయించగలిగిందని దానికంటే తామెంతో మెరుగు కనుక తమను ఇంక ఎవరూ ప్రశ్నించరాదని బిజెపి పాలకులు భావిస్తూ జబ్బలు చరుచుకుంటున్నారు.

ఆదాయ పన్నుశాఖ వివరాల ప్రకారం 125 కోట్ల జనాభా వున్న మనదేశంలో సంవత్సరానికి 50 లక్షల రూ।పైబడిన ఆదాయం కలవారు కేవలం లక్షన్నర మంది మాత్రమేనని చెప్పటాన్ని గమనిస్తే మనకళ్ళ ఎదుటే ఎందరు బడాచోర్‌లు బహిరంగంగా 'దాగి' వున్నారో అర్థమౌతుంది. చట్టాలను తమ చుట్టాలుగా మలచుకోని ఎందరు ధనస్వాములు ప్రభుత్వ ఆదాయాలకు గండికొడుతున్నారో స్పష్టమౌతోంది.

స్వదేశంలోకానీ, విదేశాలలోకానీ నల్లధనంగా చెలామణి అవుతున్న సంపదంతా ఆకాశం నుండి ఊడిపడిందీకాదు; అదృష్టం కలిసివచ్చి ఏ కొందరికో ఒనగూడిందీ కాదు. ఈ సంపదంతా అశేష కార్మిక, పీడిత ప్రజల శ్రమశక్తి ఫలితం; వారి కష్టార్జితమనేది తిరుగులేని వాస్తవం. కనుక శ్రామిక ప్రజానీకాన్ని ఘోర దురవస్థల పాల్జేసి, క్రూర దోపిడీకి గురిచేసి పోగేసుకున్న ఈ సమస్త సంపదంతా, వాటి సృష్టికర్తలైన, వాటి హక్కుదారైన పీడిత, శ్రామిక ప్రజానీకానికే చెందితీరాలి. అయితే, దోపిడీ వర్గ ప్రయోజనాలను పరిరక్షించే, వారి ప్రతినిధులైన ఈ దళారీ పాలకులను కూలదొయ్యకుండా ఈ సంపద మొత్తాన్ని వెలికితీసి, దేశ - ప్రజల సర్వతోముఖాభివృద్ధికి వినియోగించటం సాధ్యంకాదు.★

ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ వేగవంతం

పాకిస్థాన్‌పై 'సర్జికల్ దాడులు' సాగించి ఉగ్రవాదంపై పోరాడుతున్నామంటూ బిజెపి ప్రభుత్వం జాతీయ దురభిమానాన్ని ఓవైపున ప్రేరేపిస్తూనే, ప్రజల దృష్టిని పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా మళ్ళించే జాతీయోన్మాదపు ఈ రొద నడుమే - ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ కార్యక్రమాన్ని వేగవంతం చేసింది.

మనదేశ ఆర్థికవ్యవస్థలో పరివర్తన తెచ్చేందుకు తాను పూనుకున్నట్లుగా మోదీ పదేపదే నొక్కి చెపుతున్నాడు. దీని అర్థమేమంటే - ఆర్థికవ్యవస్థలో ప్రభుత్వం తన పాత్రను పరివర్తన చెందించుకొంటుందన్నమాట! అంటే, ఆర్థికవ్యవస్థను క్రమబద్ధీకరించే తన పాత్ర నుండి ప్రభుత్వం వైదొలగి ప్రైవేటు రంగానికి పూర్తిగా పగ్గాలు అప్పగించటమే.

సెప్టెంబర్ చివరివారంలో, ఆర్థికవ్యవహారాల క్యాబినెట్ సబ్‌కమిటి ప్రభుత్వ అదుపులోని సంస్థలను ప్రైవేటీకరించాలని నిర్ణయించింది. "వ్యూహాత్మక అమ్మకాల" ద్వారా అంటే వాణిజ్యసంస్థలలోని ప్రభుత్వ వాటాలను అమ్మటం దగ్గర నుండి ప్రైవేటు రంగానికి ఆదేశ పత్రాల అదుపు వరకు 20,500 కోట్ల రూ।।లను ఈ సంవత్సరం ఆర్జించదలచుకుంది.

ప్రాథమికంగా, హిందూస్థాన్ కేబుల్స్ మరియు భారత్ పంప్స్ అండ్ కంప్రెసర్స్ ఖాయిలాపడిన కారణంగా వాటిని పూర్తిగా మూతవేయాలని క్యాబినెట్ కమిటి నిర్ణయించింది. ప్రధాని మోదీ అధ్యక్షులుగానున్న ఆ క్యాబినెట్ కమిటి మరో 24 ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేసేందుకు ఓ పథకాన్ని సిద్ధంచేసింది.

'నీతి ఆయోగ్' నియమించిన ఓ కమిటి చేసిన సిఫార్స్‌లే క్యాబినెట్ కమిటి చేసిన ఈ నిర్ణయాలకు పునాదిగా వున్నాయి.

ప్రభుత్వరంగ సంస్థలను మూతవేసి, అవి చెల్లించాల్సిన అప్పులను చెల్లించిన తర్వాత ఆ ఆస్తిని అమ్మి, డబ్బురూపంలో మార్చుకోనున్నారు. అనగా మూతవేసిన ఆయా ప్రభుత్వరంగ సంస్థలకు చెందిన భూమి తదితరాలతో సహా ఆస్తి అంతటినీ అమ్మి వేస్తారు. ఎక్కువభాగం ఇలాంటి సంస్థల భూములను వేలం వేస్తారు. ప్రైవేటురంగ కొనుగోలుదారులే ఓ 'సిండికేట్'గా ఏర్పడి తక్కువ రేటుకు వేలంపాటద్వారా ఈ ఆస్థలను కైవసం చేసుకుంటారు.

ఈ రకమైన భూములను, ఆస్తులను ప్రైవేటురంగానికి అమ్మివేయటం, ఆశ్రిత విధానాన్ని ప్రోత్సహిస్తుంది. దేశీయ ప్రైవేటు యాజమాన్యాలకుగానీ లేదా విదేశీ కార్పొరేట్లకుగానీ ఈ ఆస్తులను అమ్మివేయటం - ఆశ్రిత పెట్టుబడిదారీ విధానానికి (క్రోనీ క్యాపిటలిజమ్) దోవతీస్తుంది. భూసేకరణలో ఏవిధమైన చట్టబద్ధ చీకాకులూ లేకుండా అత్యంత చౌకధరలకు బడా పెట్టుబడిదారులకు, పారిశ్రామిక కార్పొరేట్లకు భూములను కట్టబెట్టటమనే ప్రభుత్వ ఉద్దేశ్యం మేరకే, ఈ విధంగా ప్రభుత్వరంగసంస్థల భూములను అమ్మివేస్తుందనేది స్పష్టం.

15వేల హెక్టార్ల భూములను కలిగివున్న హెచ్‌ఎసిఎల్‌కు చెందిన ఇండియన్ ఆయిల్ బయోఫ్యూయెల్ లిమిటెడ్ అనే ఓ కంపెనీని మూసివేయ సంకల్పించారు. ఈ తరహాలో మొత్తం ప్రభుత్వరంగ సంస్థలను తుడిచిపెట్టే ప్రక్రియ అమలుతో ఏ మోతాదులో అమ్మకాల రూపంలో ప్రభుత్వ భూమిని ప్రైవేటు రంగానికి కట్టబెట్టనున్నారో మనం చాలా తేలిగ్గా అర్థంచేసుకోవచ్చు.

అదే, భూమిలేని నిరుపేదలకు భూమిపంపిణీ చేయవలసివస్తే, నిరుపేద దళితులకు, ఆదివాసులకు, నిరుపేద శ్రామికులకు లేదా పారిశ్రామిక కార్మికులకు తలదాచుకోను గూడుకోసం ఇళ్ళస్థలాలు కేటాయించ వలసివస్తే మాత్రం ప్రభుత్వాలకు, పాలకులకు భూమి ఎక్కడా కనబడదు. కానీ బడాపెట్టుబడిదారులకు ప్రభుత్వరంగ సంస్థలకు చెందిన, భారత ప్రజలందరి ఉమ్మడి, సంయుక్త ఆస్థి అయిన విశాల భూఖండాలను అప్పగించే విషయంలో ముందువెనక ఆలోచించేదేమీ లేకుండా, చట్టపరమైన ఆటంకాలేమీ లేకుండా కట్టబెడ్తున్నారు.

భూమి సమస్య విషయంలో ప్రభుత్వాల వర్గ దృక్పథం ఇంతే వుంటుంది. భూమిలేని నిరుపేద శ్రామికులకంటే ప్రైవేటు రియల్‌ఎస్టేట్ వ్యాపార వర్గానికి పెద్దపీటవేసి, ప్రాముఖ్యతనీయటమే జరుగుతుంది.


వాస్తవానికి నిజమైన అర్థంలో ప్రభుత్వరంగ సంస్థలేవీ నష్టాలలో నడవటంలేదు. ప్రభుత్వరంగ సంస్థలకు ఆపాదిస్తున్న నష్టాలేవైతోవున్నాయో, ఆ నష్టాలన్నీ నిజానికి సంబంధిత ప్రభుత్వాల విధానాల ఫలితంగా సంభవించినవేనేది స్పష్టం.

2013-14 ఆర్థిక సంవత్సర కాలంలో పన్నులు, సుంకాలు, డివిడెండ్ల రూపంలో ప్రభుత్వరంగ సంస్థలు ప్రభుత్వ ఖనాజాకు 2,20,166 కోట్ల రూ।ల ఆదాయాన్ని జమచేశాయి. 2012-13 ఆర్థిక సంవత్సరంలో 1,63,212 కోట్ల రూ।। ప్రభుత్వానికి చెల్లించాయి. ఈ విధంగా ఈ స్థాయి పెద్దమొత్తాలను ఆదాయంగా దిగమింగుతున్న ప్రభుత్వాలు వాటిని నష్టాలను సమకూర్చే ప్రభుత్వరంగ సంస్థలుగా మిగుల్చుతున్నాయి.

గత ఎనిమిది సంవత్సరాల కాలంలో ప్రభుత్వాలు భారత మరియు విదేశీ కార్పొరేటు రంగానికి 6.5 లక్షల కోట్ల రూ।।విలువైన రాయితీలను కల్పించాయి. దీనికి తోడుగా, ఈ కార్పొరేట్లనుండి వసూలు చేయబడని పన్నులు దాదాపు నాల్గునుండి ఆరు లక్షలకోట్ల రూ।। వరకు వుంటాయి. ఈ రాయితీలకు తోడుగా, పది బడాకార్పొరేటు సంస్థలు జాతీయ బ్యాంకులనుండి అప్పులు తీసుకొని ఎగ్గొట్టిన వాని విలువ 8 లక్షల కోట్ల రూపాయలుగా వుంది. వీటిని పారుబాకీల క్రింద జమకట్టి రద్దుచేయటం జరుగుతోంది. బడాపెట్టుబడిదారీ కార్పొరేట్లకు పెద్దపళ్ళెంలో వడ్డించి కట్టబెడ్తున్న ఈ పెద్ద మొత్తాలతో పోల్చినపుడు, ప్రభుత్వరంగ పరిశ్రమల ఆస్తులను, భూములను, వాటాలను అమ్మటంద్వారా రాబట్టదలచుకున్న మొత్తం అతి స్వల్పమైనది. బడా పెట్టుబడిదారులకు ఇవన్నీ సమర్పించటంతో ప్రభుత్వం సంతృప్తి చెందకుండా, ప్రభుత్వరంగ సంస్థల అత్యంత విలువైన భూములను 'పరివర్తన దశ' పేరున ప్రైవేటు రంగానికి కట్టబెట్టేందుకు పూనుకుంది.

ఇటీవల తాజాగా ప్రభుత్వరంగ సంస్థ అయిన బిహెచ్‌ఇఎల్ 40శాతం డివిడెండ్లను ప్రకటించటమే, ప్రభుత్వరంగ సంస్థలు నష్టాలతో నడుస్తాయనే వాదనలన్నీ, కాకమ్మ కథలని, అవాస్తవికమైనవని రుజువు చేస్తున్నది. ప్రభుత్వాల, పాలకుల ప్రజావ్యతిరేక విధానాలను, ప్రైవేటీకరణ పథకాలను అమలుచేసే ఉద్దేశాన్ని మరుగుపరిచేందుకు ప్రభుత్వరంగ సంస్థలు నష్టాల్లో నడుస్తున్నాయని ప్రభుత్వాలు చెప్పేది ఓ సాకు మాత్రమే!

ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఈ ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా ప్రజానీకం మద్దతుతో ఈ దేశ కార్మికులు, కార్మికవర్గం ఐక్యంగా పోరాడటం ద్వారానే ప్రజల ఆస్థలయిన ప్రభుత్వరంగ సంస్థలు ప్రైవేటు కార్పొరేట్ల హస్తగతం కాకుండా కాపాడుకోవటం సాధ్యమౌతుంది. ★



టి.ఎన్.ఎం ట్రస్ట్ పునర్ముద్రణ

ప్రజల్ని విప్లవ కార్యాచరణకు కదిలించడమే

మన కర్తవ్యం

తరిమెల నాగిరెడ్డి అసెంబ్లీ ఉపన్యాసాలు, ఇంటర్వ్యూలు

పేజీలు : 32

వెల : రూ. 10/-

కాపీలకు :

మైత్రీబుక్‌హౌస్,

జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్ రోడ్,

విజయవాడ-2

'కరువు పారిపోతే' కరువు మండలాలు ఎలా ప్రకటించారు?

రెయిన్‌గన్‌లతో రాష్ట్రం నుండి కరువుని పారద్రోలానని, రాయలసీమలో పంటలు కాపాడానని ఆ ఘనత తనదేనని ముఖ్యమంత్రి చంద్రబాబు సెప్టెంబర్ 10న ఘనంగా చెప్పుకొన్నారు!

అదే చంద్రబాబు ప్రభుత్వం అక్టోబర్ 21 రాత్రి సమయంలో హడావుడిగా కరువు మండలాలను ప్రకటించి ఆశ్చర్యపరిచింది. ఈ రెండు విరుద్ధ ప్రకటనలతో రాష్ట్రంలో అసలు కరువు ఎప్పుడు పోయిందో రైతాంగానికి అర్థంకాని పరిస్థితి ఏర్పడింది.

ఆగస్టు నెల చివరి వరకు రాష్ట్రంలో తీవ్ర దుర్భిక్షం నెలకొని ఉంది. లక్షలాది ఎకరాల్లో సేద్యం జరగలేదు. రాయలసీమలో 21.55 లక్షల ఎకరాల్లో వేసిన వేరుశనగ ఎండుముఖం పట్టి ఆగస్టు చివరినాటికి 17.53 లక్షల ఎకరాల్లో పంట ఎండిపోయింది. గుంటూరు, కృష్ణా జిల్లాల్లో ఎదపెట్టిన విత్తనాలు, నారుమళ్ళు పనికిరాకుండా పోయాయి. బోర్లు ద్వారా వేసిన పైర్లు నీరు అందక ఎండిపోయాయి. తూర్పు, పశ్చిమ గోదావరులు, విజయనగరం, శ్రీకాకుళం, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

రాష్ట్రంలో ఏర్పడిన కరువు, గ్రామీణ ప్రజలను అతలాకుతలం చేస్తుంటే, దాన్ని ఎదుర్కొనే చర్యలు తీసుకోకుండా చంద్రబాబు పుష్కరాల జపం చేయటంపై తీవ్ర విమర్శలు సాగాయి. దాన్ని ప్రక్కదారి పట్టించేందుకు రెయిన్‌గన్లను చంద్రబాబు ముందుకు తెచ్చాడు. వాటి ద్వారా పంటలు కాపాడతానని ఆచరణ సాధ్యంకాని మాటలు చెప్పాడు. ఈ మాటలు చెప్పిన సమయంలోనే అల్పపీడనాలు, వాయుగుండాలు, తుఫాన్‌ల వలన విస్తారంగా వర్షాలు పడతాయని వాతావరణశాఖ చెప్పటంతోనే చంద్రబాబు రెయిన్‌గన్ల ఉద్దేశ్యం అర్థమౌతోంది. సెప్టెంబర్ 1 నుండి రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలుపడ్డాయి. గుంటూరు జిల్లా, పల్నాడు, ఉభయగోదావరి జిల్లాల్లో వర్షనీరు పొంగి 6 లక్షల ఎకరాలకు పైగా పంటలను ముంచింది. ఈ వర్షాల వలన కొన ఊపిరితో మిగిలి ఉన్న పైర్లకు ఊపిరి వచ్చింది. దీన్ని తన స్వార్థ రాజకీయ ప్రచారానికి ఉపయోగించుకొన్నాడు. వర్షాలకు ఏమీ ప్రాముఖ్యత లేనట్లు, రెయిన్‌గన్ల వలనే పంటలను కాపాడినట్లు, వాటి ద్వారా కరువును పారద్రోలినట్లు విస్తృత ప్రచారం చేశాడు. (రెయిన్ గన్ల గురించి 20-9-16 'జనశక్తి' చూడండి) ఇది పెద్ద జోక్‌గా మారింది.

సెప్టెంబర్‌లో వర్షాల వలన కొన్ని జిల్లాల్లో కొంతమేరకు పైర్లకు జీవంపోసినా మరోవైపు లక్షలాది ఎకరాల పైరు ముంపుకి గురైంది. ఇలాంటి పరిస్థితుల్లో కూడా నెల్లూరు, శ్రీకాకుళం, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో తక్కువ వర్షపాతం నమోదు అయ్యింది. జూన్ నుండి అక్టోబర్ 15 తేదీ వరకు రాష్ట్రంలో 662.7 మిల్లీమీటర్లు నమోదుకావాల్సి ఉండగా 569.7 మి.మీ. నమోదైంది. అంటే 14 శాతం తక్కువ వర్షపాతంగా ఉంది. ఈ కాలంలో రాష్ట్రంలోని 13 జిల్లాల్లో నమోదు అయిన వర్షపాతం అందుకు నిదర్శనంగా ఉంది.

వివిధ జిల్లాల్లో నమోదైన వర్షపాతాన్ని గమనిస్తే (పట్టిక చూడండి) మూడు జిల్లాల్లో సాధారణంకంటే కొంచెం ఎక్కువగాను, ఆరు జిల్లాల్లో సాధారణం కంటే కొంత తక్కువగాను, నాలుగు జిల్లాల్లో తక్కువ, అతి తక్కువగాను వర్షపాతం నమోదైంది. సెప్టెంబరులో కురిసిన వర్షం కురవాల్సిన మొత్తం వర్షపాతంలో నమోదుకావటం వలన కరువు ప్రకటన నిబంధనల ప్రకారం సాధారణం కంటే తక్కువగా వున్నా శ్రీకాకుళం, ఉభయగోదావరులు, గుంటూరు, కృష్ణా, కడప, కర్నూలు జిల్లాలు సాధారణ వర్షపాతం జిల్లాలుగా పరిగణించబడుతున్నాయి.

ఒక ప్రాంతాన్ని, మండలాన్ని, రాష్ట్రాన్ని కరువు మండలంగా ప్రకటించాలంటే వర్షపాతం లోటు 19 శాతానికి తక్కువకాకుండా ఉండాలి. అందుకు తగ్గితే నిబంధనల ప్రకారం కరువు ప్రాంతంగా ప్రకటించటానికి వీలుపడదు. రాష్ట్రంలో 14 శాతం తక్కువ వర్షపాతం నమోదు అయ్యింది కాబట్టి రాష్ట్రాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించలేదు. కొన్ని జిల్లాల్లో మండలాలవారీగా కరువును ప్రభుత్వం ప్రకటించింది. ఈ నిబంధనలు లోపభూయిష్టమైనవి. నెలల తరబడి వర్షాలు కురవకుండా దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడి, ఆ తర్వాత రెండు, నాలుగు రోజులు విస్తృతంగా వర్షాలు కురిస్తే, ఆ వర్షపాతాన్ని కురవాల్సిన వర్షపాతంలో నమోదుచేసి, అంతకుముందు దాకా ఉన్న దుర్భిక్ష ప్రాంతాన్ని, దుర్భిక్షరహిత ప్రాంతంగా చెప్పటమే హాస్యాస్పదమైన విషయం. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ప్రస్తుతం నమోదైన వర్షపాతం ఆవిధంగానే ఉంది. దానికి అనుగుణంగానే ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించటం వలన అనేక మండలాలు కరువు మండలాల జాబితా నుండి తొలగించబడ్డాయి.

వర్షపాతం గణాంకాల ప్రకారం సెప్టెంబరు ఆఖరునాటికి రాష్ట్రంలోని 500 మండలాల్లో దుర్భిక్షం నెలకొని వుంది. ఆ నెల రెండవ వారంలో కురిసిన వర్షాల వలన వ్యవసాయ తరుణం దాటిపోవటంతో సేద్యం జరగలేదు. సెప్టెంబర్ రెండవ పక్షంలో భారీవర్షాలు, వరదల వలన అది సాధారణ వర్షపాతంలో చేరి దుర్భిక్ష మండలాల సంఖ్యను 300లకు తగ్గించింది. అప్పటికే కరువు నుంచి తగ్గించిన మండలాల్లో జరగాల్సిన పంటనష్టం జరిగింది. వాటిని కూడా కరువు మండలాలుగానే పరిగణించాల్సి ఉన్నా ప్రభుత్వం అలా చేయలేదు. సెప్టెంబరు రెండవ వారానికి ముందున్న వర్షపాతం, ఎండిన పంటలు (డ్రైస్పెల్-ఒక వర్షానికి మరొక వర్షానికి మధ్య 21 రోజులుదాటటం) లెక్కవేసి కరువు మండలాలను ప్రకటించాల్సి ఉంది. దీన్ని ప్రభుత్వం పాటించలేదు. చివరికి 245 మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించింది.

గత రెండు సంవత్సరాలుగా కరువు మండలాలను ప్రకటించటంలోనూ చంద్రబాబు ప్రభుత్వం తీవ్ర జాప్యం చేసింది. నివేదికలు కేంద్రానికి పంపటంలోనూ నెలల తరబడి జాప్యం చేసింది. ఈ సంవత్సరంలో కూడా అదే జరిగింది. జులై నుండి సెప్టెంబర్ మొదటివారందాకా రాష్ట్రం తీవ్ర దుర్భిక్షంలో ఉన్నా కరువు ప్రాంతాలను ప్రకటించలేదు. కరువు లేదన్నట్లు చంద్రబాబు ప్రభుత్వం వ్యవహరించింది. ఫలితంగా కేంద్రం రాష్ట్రంలో కరువు లేదన్నట్లు వ్యవహరించింది.

కరువును పారద్రోలినట్లు తాను చేసిన వ్యాఖ్యలు అపహాస్యం కావటం, అనేక జిల్లాల నుండి వెల్లువలా కరువు వార్తలు రావటంతో కరువుని కప్పిపెట్టటం సాధ్యంకాక కరువు మండలాలను ప్రకటించక తప్పలేదు. రెయిన్‌గన్‌లు, పట్టిసీమ ద్వారా సాగునీరు అందించి సేద్యం సజావుగా పూర్తిఅయ్యేటట్లు ప్రచార బూటకత్వం బయటపడకుండా ఉండేందుకే చంద్రబాబు కరువు మండలాలను అక్టోబరు 21 వరకు ప్రకటించలేదు. రాష్ట్రంలో 400 మండలాలు కరువుబారినపడి సతమత మౌతున్నాయని అందులో 72 మండలాలు తీవ్ర వర్షాభావం, 27 మండలాల్లో పెను కరువు నెలకొని ఉందని వ్యవసాయశాఖ అధ్యయన నివేదికలు తెలుపుతున్నా, 245 మండలాలనే ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించింది. ఇందుకు కారణం రైతాంగానికి ఇన్‌పుట్ ఇవ్వాల్సి వస్తుందనే.

రాష్ట్రంలో జూన్ నుండి అక్టోబర్ 15 వరకు కురిసిన వర్షపాతం

జిల్లా	కురవాల్సిన వర్షం	కురిసిన వర్షపాతం	వ్యత్యాసం శాతం	స్థాయి
శ్రీకాకుళం	846.5	699.1	-17.4	సాధారణం
విజయనగరం	881.5	881.7	07.1	సాధారణం
విశాఖపట్నం	862.4	923.2	07.1	సాధారణం
తూర్పు గోదావరి	909.8	841.7	-07.5	సాధారణం
పశ్చిమ గోదావరి	905.4	825.6	-8.8	సాధారణం
కృష్ణా	790.6	741.0	-6.3	సాధారణం
గుంటూరు	611.8	710.1	16.1	సాధారణం
ప్రకాశం	505.4	355.0	-29.8	తక్కువ
నెల్లూరు	425.7	171.9	-59.6	మరీ తక్కువ
చిత్తూరు	518.6	366.1	-29.4	మరీ తక్కువ
కడప	464.7	395.3	-14.9	సాధారణం
అనంతపురం	406.8	264.4	-35.0	మరీ తక్కువ
కర్నూలు	543.3	475.6	-12.5	సాధారణం
మొత్తం రాష్ట్రం	**662.7**	**569.7**	**-14.0**	**సాధారణం**

ఆధారం : 16-10-16 'విశాలాంధ్ర'

కరువు కోరల్లో చిక్కుకున్న గ్రామీణ పేదలను, రైతాంగాన్ని ఆదుకొనటంలో పాలక ప్రభుత్వం ఏదైనా సహాయకచర్యల్లో ఇష్టపూర్వక విఫలతను ప్రదర్శించాయి. 2014-15 సంవత్సరంలో 225, 2015-16 సంవత్సరంలో 359 మండలాలను కరువు మండలాలుగా చంద్రబాబు ప్రభుత్వం ప్రకటించింది. గత మూడు సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం 3 వేల కోట్ల రూపాయలదాకా నష్టం వాటిల్లింది. హుదూద్ తుఫాన్ వల్ల 1000 కోట్లు నష్టం జరిగింది. ఇంత నష్టం జరిగినా రాష్ట్ర ఖజానా నుండి చంద్రబాబు సహాయంగా ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. కేంద్రం యిస్తేనే సహాయకచర్యలు అన్నట్లు వ్యవహరించాడు. కేంద్ర బృందాలు రావటం, పరిశీలించటం ఆలస్యం కావటమే కాకుండా, సహాయం ప్రకటించటంలోను కేంద్రం జాప్యం చేసింది. ప్రకటించిన సహాయం నామమాత్రమైనా అదీ పూర్తిగా విడుదల చేయలేదు. విడుదల చేసిందీ సహాయకచర్యలకు చంద్రబాబు ఖర్చు చేయలేదు. వేలకోట్లు నష్టం జరిగితే 2015-16 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం 434 కోట్లు, 14వ ఫైనాన్స్ కమీషన్ 440 కోట్లు రాష్ట్రానికి సహాయంగా ప్రకటించింది. దీన్లో కూడా రైతులకు ఇన్‌పుట్ పంపిణీ జరగలేదు. దానికోసం రైతాంగం ఆందోళనలు చేస్తూనే ఉన్నారు.

ఈ సంవత్సరం ఏర్పడిన కరువు వలన రాష్ట్రంలో తీవ్ర నష్టం జరిగింది. ఒక్క వేరుశనగ రైతులే 7 వేలకోట్లు నష్టపోయారు. మిర్చి, పత్తి, వరిపై వేలాదికోట్ల నష్టం జరిగింది. సెప్టెంబర్‌లో వచ్చిన భారీవర్షాల ముంపు వలన పంటలకు అపార నష్టం జరిగింది. ఉపాధి లేక గ్రామీణ పేదల వలసలు ఎక్కువయ్యాయి. పశుగ్రాసం, మంచినీటి సమస్య తీవ్రమైంది. పశుపోషణ భారమై వాటిని కబేళాలకు తరలిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న కరువు పీడిత ప్రజలను ఆదుకొనే చర్యలు ప్రభుత్వం ఇంతవరకు తీసుకోలేదు. ప్రజలు దుర్భరపరిస్థితులను ఎదుర్కొంటున్నారు. కనీసం కరువు మండలాల నివేదికను కేంద్రానికి పంపి సహాయం కూడా కోరలేదు.

కరువు పరిస్థితుల ఎడల ప్రభుత్వ విధానాన్ని నిరశిస్తూ, పంటలు కోల్పోయిన రైతులకు పూర్తి పరిహారం చెల్లించాలని, గ్రామీణ పేదలకు ఉపాధి పనులతోపాటు రెండు నెలలకు సరిపోను నిత్య జీవితావసర వస్తువులు ఉచితంగా ఇవ్వాలని, పశుగ్రాసం సప్లయ్ చేయాలనీ, నిత్యజీవితావసర వస్తువులను చౌకడిపోల ద్వారా అందించాలనీ, పేద, మధ్యతరగతి రైతుల బ్యాంక్ అప్పులు రద్దుచేయాలని, స్వల్పకాలిక పంట విత్తనాలు అందించాలనీ, రిజర్వాయర్ల, ప్రాజెక్టుల నీటిని సాగుకి ప్రాధాన్యం ఇవ్వాలని గ్రామీణ పేదలు, రైతాంగం ఐక్యంగా ఉద్యమించాలి. ✸

మద్యం షాపుల తొలగింపుకోసం ఆందోళన

విజయనగరం, 12-9-16 :


విజయనగరంలో శాంతినగరం ప్రాంతం పూర్తిగా రెక్కల కష్టం మీద ఆధారపడి రెక్కాడితేగాని డొక్కాడని శ్రమజీవులతో నిండి ఉంటుంది. గతంలో ఇక్కడ విజయ్‌బార్ ఉండేది. దానితోపాటు గత యేడాది సూర్య వైన్స్ అనే మద్యంషాపుకు అధికారులు అనుమతిచ్చారు. ఈ రెండు మద్యం విక్రయకేంద్రాలు పోటీలుపడి ప్రజలచేత తాగించడంతో సాయంత్రం సమయంలో ఈ ప్రాంతం ముఖ్యంగా రోడ్ వెంబడి మహిళలు నడవలేనిస్థితి ఏర్పడింది. రోడ్‌మీదే లారీలు వంటి భారీ వాహనాలు, బైక్‌లు పార్క్‌చేసి నడిరోడ్డుపైనే మద్యం సేవించేవారి ఆగడాలతో రాత్రి 11, 12 గం॥ వరకు పరిస్థితి దారుణంగా ఉంటూ వస్తుంది. మరలా ఉదయం 5 గంటలకే మద్యంషాపులు తెరిచి అమ్ముతున్న పరిస్థితితో, ఈ చుట్టుప్రక్కల వారికి, ఈ రోడ్డుగుండా వెళ్ళేవారికి ప్రతిరోజూ నరకప్రాయమైంది. ఈ రెండు మద్యం కేంద్రాలు ఒకటి అధికార టిడిపిదైతే మరొకటి వైఎస్ఆర్ పార్టీ నాయకుడిది. ఎక్సైజ్ అధికారుల అండతో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగిస్తూవచ్చారు.

మద్యంషాపు వద్ద ట్రాక్టరు క్రింద పడి ఇటీవల ఒక వృద్ధురాలు మరణించింది. 30-8-16న మరో వాహనం ఢీకొని ముగ్గురికి గాయాలయ్యాయి. దీనితో ఈ ప్రాంత ప్రజల సహనం నశించి, మహిళలు తమంతట తామే స్వచ్ఛందంగా కదిలి రెండు మద్యంషాపులను దగ్గర వుండి మూయించివేశారు. రహదారి దిగ్బంధం చేశారు. అధికారుల తీరును నిరసించారు. పోలీసులను మహిళలు నిలదీశారు.

ఈ మహిళల ఆందోళనకి సిపిఐ, ఏఐఎఫ్‌టియు(న్యూ), ఎన్‌వైఎస్ మద్దతుగా నిల్చాయి. 'మద్య వ్యతిరేక పోరాటకమిటీ' ఏర్పడింది. ఈ రెండు మద్యంషాపుల వద్ద మహిళల నిరవధిక ధర్నా ప్రారంభమయ్యింది. కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కలెక్టర్ ఆఫీసు వరకు ప్రదర్శన, ధర్నా జరిగాయి. ఆగస్టు 10, 11 తేదీలలో ఏపి బాలసంఘం సభ్యులు గౌతమి, సునీత తదితరులు మద్యం వ్యతిరేకపోరాట శిబిరంలో పాటలు పాడి వినిపించారు. జనంపాటలు మహిళలను బాగా ఆకట్టుకున్నాయి. 11వ తేదీన సాయంత్రం ఎన్‌వైఎస్ ఆధ్వర్యంలో మహిళలు, బాలలు ప్రదర్శన జరిపి శిబిరంలో ధర్నా నిర్వహించారు.

12-8-2016న గ్రీవెన్స్ డే రోజున వినతిపత్రం ఇవ్వడానికి పోరాటకమిటీ కలెక్టరు ఆఫీసుకు వెళ్ళి రాష్ట్రమంత్రి, జిల్లాకు చెందిన కిమిడి మృణాళినికి వినతిపత్రం ఇవ్వగా ఆమె నిర్లక్ష్యపూరితంగా వ్యవహరించడంతో మంత్రిని నిలదీస్తూ మద్యం వ్యాపారుల కొమ్ముకాస్తున్న ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ పోరాటకమిటీ సభ్యులు పెద్దపెట్టున నినాదాలు చేశారు. పోరాటకమిటీ సభ్యులను పోలీసు అధికారులు ఈడ్చుకు పోయారు. ఈ అలజడితో అధికార యంత్రాంగం కదిలింది. ఎస్పి ఆధ్వర్యంలో సమావేశం జరిపి 20 రోజుల్లో మద్యంషాపులు ఆ ప్రాంతం నుంచి తరలించాలని అప్పటిదాకా ఆ మద్యంషాపులను కూడా తెరవవద్దని ఎక్సైజ్ అధికారులతో చర్చించి ఆదేశించారు.

మద్యంషాపులు తరలించడానికి 20 రోజులు గడువు ఇచ్చినందున తాత్కాలికంగా ఆందోళన విరమించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో మహిళాసంఘం బాయి రమణమ్మ, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బి. అశోక్, ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు బి. శంకరరావు, మున్సిపల్ కౌన్సిలర్ కె. వరలక్ష్మి, ఎన్‌వైఎస్ జిల్లాఅధ్యక్షులు ఎం.అప్పలరాజు, బాలసంఘం ప్రతినిధి కె. గౌతమి తదితరులు పాల్గొన్నారు. ✸



Janasakti (Communist Revolutionaries'Fortnightly) RNI No.8315/63 VJ-077/2016-18
No.of pages : 8 Date of publication : 3rd & 18th of Every Month Posting date : 5th & 20th of Every Month

ఎదురు కాల్పుల పేరుతో రాజ్యం సాగిస్తున్న బీభత్సాన్ని ఖండించండి

2016 అక్టోబర్ 24న ఆంధ్రప్రదేశ్ గ్రేహౌండ్స్ మరియు ఒడిషాకు చెందిన ఎస్ఓజిల సంయుక్త పోలీసు చర్యలో – ఒడిషాలోని మల్కన్‌గిరి జిల్లా, పనసపుట్టు గ్రామంవద్ద సిపిఐ(మావోయిస్టు)కు చెందిన నాయకులను, కార్యకర్తలను మరియు ఆదివాసీ ప్రజలను మొత్తంగా 24 మందిని కాల్చి చంపారు. అదే అటవీ ప్రాంతంలో అక్టోబరు 25వ తేదీన మరో నాలుగు మృతదేహాలను కనుగొన్నారు. దీనితో మొత్తంగా మృతుల సంఖ్య 28కి చేరింది. తమ భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన 'ఎన్‌కౌంటర్'లో వీరంతా మృతిచెందినట్లుగా పోలీసులు ప్రకటించారు. కానీ, వాస్తవాలను పరిశీలిస్తే, పకడ్బందీ పథకం రూపొందించి, తదనుగుణంగా క్రూరంగా అమలుచేసిన ఘోరమైన హత్యలని తేటతెల్లమవుతోంది. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, చట్టబద్ధపాలనలపై ప్రమాణంచేసిన పాలకులు నగ్నంగా వాటిని ఉల్లఘించారని స్పష్టమౌతోంది. 'కూంబింగ్'ల పేరుమీద ప్రజలపై సాగిస్తున్న రాజ్యబీభత్సాన్ని, భీభత్సకర పద్ధతులను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఆ ప్రాంతంలో ప్రజలపై సాగిస్తున్న ఊచకోతను తక్షణం నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నాం.

కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ అధికారంలో వున్న పాలకులు మనదేశంలో సహజ సంపదలను, మానవవనరులను సామ్రాజ్యవాదులకు అమ్మివేసే తమ విధానాలను కొనసాగిస్తున్నారు. అమెరికా ఆధిపత్య వ్యూహంతో వారు భారతదేశాన్ని ఓ సాధనంగా మలిచారు. పాలకులు అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల, ఫ్యూడల్ అనుకూల విధానాలు, మన ప్రజానీకంలోని అన్ని సెక్షన్లను, వారి జీవితాలలోని అన్ని పార్శ్వాలను ఘోరమైన సంక్షోభంలోకి పడదోశాయి. మన ప్రజల ప్రజాస్వామిక హక్కులపై దాడులను పాలకులు తీవ్రం చేశారు. మతతత్వం, ప్రాంతీయతత్వం, కులతత్వం, జాతీయ దురభిమానాలను మరియు ఫాసిస్టు ధోరణులను ప్రయోగిస్తూ ప్రజానీకపు వాస్తవిక సమస్యల నుండి ప్రక్కదోవ పట్టించి, ప్రజలలో చీలికలు కల్పించటానికి పాలకులు అన్నివిధాలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ పరిస్థితి నుండి బయటపడటానికి ప్రజానీకం తీవ్రంగా సంఘర్షణ పడుతున్నారు.

తీవ్రవాద రాజకీయాలు, ఆచరణలు ఏ రూపంలోనూ ప్రజలకు తోడ్పడకపోగా, వారికి హాని కలుగ జేస్తాయని మేము స్పష్టంగా వున్నాం. దోపిడీ పాలకవర్గాల విధానాలకనుగుణంగా నిజబాధితులైన ప్రజానీకాన్ని వారి జీవితాల రక్షణకోసం, వారి ప్రజాస్వామ్య హక్కులను కాపాడుకొనేందుకు, మెరుగైన భవిష్యత్తును సాధించుకొనేందుకు సమాయత్తపరిచి సంఘటిత పరచటమే ప్రజల జీవితాల్లో మౌలిక మార్పు తెచ్చేందుకు అంకితమైన వారందరిముందున్న జరూరైన, అత్యావశ్యక కర్తవ్యం.

విశ్వం
ప్రధాన కార్యదర్శి
కేంద్రకమిటి, సిపిఐ(ఎం-ఎల్)

26-10-2016

బూటకపు ఎన్‌కౌంటర్‌ను ఖండిస్తున్నాం జ్యుడీషియల్ ఎంక్వైరీ జరపాలి

ఆంధ్ర - ఒడిశా బోర్డర్‌లో ఎన్‌కౌంటర్ పేరుతో పోలీసులు 24 మంది మావోయిస్టులను హతమార్చడం అమానుషమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని వామపక్ష పార్టీల నేతలు ఉద్ఘాటించారు. ఈ మేరకు వామపక్ష పార్టీలు నేడొక ప్రకటన విడుదల చేశాయి.

ఆంధ్రా, ఒడిశా పోలీసులు, కేంద్ర బలగాలు మూకుమ్మడిగా మావోయిస్టుల సమావేశంపై కాల్పులకు పాల్పడ్డారు. ముందస్తు ప్రణాళికతో పోలీసులు కాల్పులు జరిపి 24 మంది మావోయిస్టుల మరణానికి కారణమయ్యారని భావిస్తున్నాం. ఇంత భారీగా ప్రాణ నష్టం జరిగిన ఘటన ఇదే ప్రథమం. మావోయిస్టులను పట్టుకొనే అవకాశమున్నప్పటికీ దుర్మార్గంగా ఎన్‌కౌంటర్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇది ముమ్మాటికీ ఏకపక్షంగా పోలీసులు చేసిన ఎన్‌కౌంటర్. మావోయిస్టుల మృతదేహాలకు హడావుడిగా పోస్టుమార్టం నిర్వహించడం కూడా పలు అనుమాలకు తావిస్తోంది. పోలీసులు జరిపిన ఏకపక్ష ఎన్‌కౌంటర్‌పై జ్యుడీషియల్ ఎంక్వైరీ జరిపించాలని డిమాండ్ చేస్తున్నాం.

కె. రామకృష్ణ
సిపిఐ

పి. మధు
సిపిఐ(యం)

వై.సాంబశివరావు
సిపిఐ(యంఎల్) న్యూడెమోక్రసీ

గుర్రం విజయకుమార్
సిపిఐ(యంఎల్)

యం.వెంకటరెడ్డి
యంసిపిఐ(యు)

ఎన్.మూర్తి
సిపిఐ(యంఎల్)లిబరేషన్

చిట్టిపాటి వెంకటేశ్వర్లు
సిపిఐ(యంఎల్) న్యూడెమోక్రసీ

బి.ఎస్ అమర్ నాథ్
యస్‌యుసిఐ(సి)

పి.వి.సుందరరామరాజు
ఫార్వర్డ్‌బ్లాక్

జానకి రాములు
ఆర్‌యస్‌పి

25-10-2016

రైల్వే ప్రమాదాలకు బీమా పేరిట ప్రజలపై భారం

2014లో 28,360 రైల్వే ప్రమాదాలు జరగ్గా, 25,006 మంది మృతిచెందారు. 3882 మంది గాయపడ్డారు. ప్రతి ఏడాది సగటు 15000 మంది ఈ ప్రమాదాలలో మరణిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే మృతులకూ, గాయపడ్డవారికీ నష్టపరిహారాన్ని ప్రకటించి, చెల్లించటం ఇన్నాళ్లూ చేస్తూ వచ్చారు. ఈ నష్టపరిహారం చెల్లింపు భారమైందన్న సాకుతో బీమా చెయ్యాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విధంగా ప్రమాదనష్టపరిహారం చెల్లింపు బాధ్యత నుండి తప్పుకుని బీమాకు ప్రీమియం సొమ్ము చెల్లింపు భారాన్ని ప్రయాణీకులపై మోపబూనుకుంది.

రైల్వేశాఖ దీనికోసం టెండర్లు పిలువగా, వచ్చిన వాటిలో మూడు బీమా కంపెనీలను ఎంపిక చేసింది. ప్రమాదంలో మృతిచెందినవారికి 10 లక్షల రూ।।లు, శాశ్వత సంపూర్ణ అంగవైకల్యానికి గురైన వారికి 10 లక్షల రూ।।లు, శాశ్వత, పాక్షిక అంగవైకల్యానికి గురైన వారికి 7.5 లక్షల రూ।।లు, వైద్య ఖర్చులకు 2 లక్షల రూ।।లు, మృత శరీరాన్ని స్వస్థలానికి చేర్చేందుకు 10వేల రూ।।లు బీమా కంపెనీలు చెల్లించాల్సి వుంటుంది.

శ్రీరాంజనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతి ప్రయాణీకుడికీ 92 పైసలు ప్రీమియంను పేర్కొంది. ఐసిఐసిఐ లంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ 99 పైసలు, రాయల్ సుందరం జనరల్ ఇన్సూరెన్స్ 115 పైసలు ప్రీమియంగా పేర్కొంది. దీనితో రైల్వేశాఖ ప్రతి టిక్కెట్టు మీదా 92 పైసలను ప్రీమియంగా చెల్లించేందుకు నిర్ణయించింది.

ఇన్నాళ్లూ రైల్వేశాఖ ప్రమాద బీమాకు తన ఆదాయం నుండి ప్రీమియం చెల్లించేది. ఈ ప్రీమియం ఎక్కువగా వుందన్నది రైల్వేశాఖ వాదన. దీనిని 2008-09లో మానివేశారు. ప్రతి టిక్కెట్టు పైనా 92 పైసలు (ఆచరణలో రూపాయి అవుతుంది) వసూలు చేస్తారు. ప్రస్తుతానికి దీనిని ఆన్‌లైన్‌లో టిక్కెట్లు తీసుకున్న వారినుండే వసూలు చేస్తారట. తరువాత అన్ని తరగతులకూ వర్తింపచేస్తారట.

రోజూ సగటున 60 లక్షలమంది రైల్వేల్లో ప్రయాణిస్తున్నారు. వీటిలో 59 శాతం ఆన్‌లైన్‌లో టిక్కెట్లు కొంటున్నారు. అంటే దాదాపుగా 32 లక్షలమంది. అంటే ఏడాదికి రూ।। 110 కోట్లు ప్రీమియంగా ప్రయాణీకులపై వసూలు చేసి బీమా కంపెనీలకు చెల్లిస్తారు. ఇది ప్రస్తుతానికి. ఇక ప్రయాణీకులందరికీ వర్తింపచేస్తే రూ।। 250 కోట్లు దాటుతుంది.

ఇక రైల్వే ప్రమాదాలను రెండు రకాలుగా విభజించారు. ఒకటి : ప్రమాదాలు-వీటిలో రైళ్లు ఢీకొనటం, పట్టాలు తప్పటం చేర్చారు. కాగా అగ్ని ప్రమాదాలను చేర్చలేదు. రెండు అవాంఛనీయ ఘటనలు-టెర్రరిస్టు దాడులు, హింసాయుతదాడులు, దొంగతనాలు, రైలు నుండి ప్రమాదవశాత్తూ జారిపడటాలను చేర్చారు. కాపలావున్న, కాపలాలేని గేట్ల వద్ద, ఇతరచోట్లా పట్టాలు దాటుతుండగా జరిగే ప్రమాదాలను వీటిలో చేర్చలేదు. మొత్తం ప్రమాదాలలో ఇవి సగం వరకూ వుంటాయి. వీటికి ప్రధాన కారణం. పట్టాలు దాటేందుకు తగిన రక్షిత మార్గాల ఏర్పాటును ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయటమే. ఆవిధంగా ఈ ప్రమాద బాధితులకు ఎలాంటి నష్టపరిహారం చెల్లించకుండా తప్పుకుంటున్నారు.

బీమా చేయటానికి ముందుకొచ్చిన కంపెనీలు, విదేశీ బీమా కంపెనీలతో ఏర్పడిన మిలాఖత్ కంపెనీలే. బీమారంగాన్ని ప్రైవేటీకరించి, విదేశీ పెట్టుబడి ప్రవేశానికి వీలు కల్పించిన ప్రభుత్వం, ఇప్పుడు వాటికి బీమా వ్యాపారాన్ని ఏర్పాటుచేసిపెట్టేందుకు పూనుకుంది. ప్రయాణీకులపై భారంమోపి, విదేశీ బీమాకంపెనీలకు కట్టబెట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. ★

బ్యాంక్‌లను కొల్లగొడుతున్న బడా పరిశ్రమాధిపతులు

వేలాదికోట్ల ప్రజాధనాన్ని బ్యాంక్‌లకు మూలధనంగా పాలకులు సమకూర్చిపెడుతున్నారు. ఆ ప్రజలకు మాత్రం బ్యాంక్‌లు చేయూత ఇవ్వటం లేదు. ప్రజల సొమ్మును బడా పరిశ్రమాధిపతులకు, సంపన్నవర్గాలకు, భూస్వాములకు పెద్దఎత్తున సమకూర్చిపెడుతున్నారు. రైతులు, చిరువ్యాపారులు, చిన్న పరిశ్రమదారులు, చేతివృత్తులవారు రుణాల కోసం బ్యాంక్‌లను ఆశ్రయిస్తే అనేక షరతులు పెట్టి చాలా కొద్దిమందికి మాత్రమే నామమాత్రపు రుణాలు యిచ్చే బ్యాంక్‌లు, బడా పరిశ్రమాధిపతులకు అనేక రాయితీలతో వేల కోట్ల రూపాయలు రుణాలుగా అంద చేస్తున్నాయి. పాలకులు కూడా వీరికి సంవత్సరానికి 4 లక్షల కోట్లకు పైగా రాయితీలు ప్రకటిస్తున్నారు.

సేద్యంకోసం రైతులు, బ్రతుకుతెరువుకోసం చిరువ్యాపారులు, చేతివృత్తిదారులు, జాతీయ స్వభావం కలిగిన చిన్న పరిశ్రమదారులు నష్టపోయి ఒక సంవత్సరం బ్యాంకు రుణాలు చెల్లించకపోతే ఇంట్లో సామానులు, పశువులు, పొలం జప్తు చేయటం, చిన్న పరిశ్రమల గేట్లు మూసివేసే బ్యాంక్ అధికారులు, అందుకు ఆమోదం తెలుపుతున్న పాలకులు – బడా పరిశ్రమాధిపతులు వేల కోట్లు చెల్లించకపోయినా, వారి నుండి బకాయిలు రాబట్టే చర్యలు తీసుకోవటంలేదు. మొండిబకాయిల పేరుతో వారు తీసుకొన్న రుణాలను రద్దుచేస్తున్నారు. దీన్ని గమనిస్తే పాలకులు, బ్యాంక్‌లు ఎవరి ప్రయోజనాలను పరిరక్షిస్తుందీ అర్థమౌతున్నది.

దేశీయ బ్యాంక్‌లు ముఖ్యంగా ప్రభుత్వరంగ బ్యాంక్‌ల మొండి బకాయిల (ఎన్.పి.ఏ.) సమస్య ఎక్కువగా ఉందని, ఫలితంగా బ్యాంక్ బ్యాలెన్స్‌షీట్ ప్రక్షాళనకు ఎక్కువ సమయంతోపాటు, ఎక్కువ ఖర్చు కూడా అయ్యేటట్లు ఉందని రాయిటర్ వార్తాసంస్థ పరిశోధన నివేదిక వెల్లడించింది. బ్యాంక్ ఖాతాల ప్రక్షాళనకు ఆర్.బి.ఐ. నిర్దేశించిన గడువైన 2017 మార్చి నాటికి అన్ని బ్యాంక్‌లు, తమ ఖాతాలపరంగా వసూలుకాని అన్నిరకాల మొండి బకాయిల లెక్కలు ప్రకటించాలి.

రాయటర్ వార్తా సంస్థ ఇటీవలనే ఆర్.బి.ఐ. నుండి ఎన్.పి.ఏ. వివరాలను సేకరించింది. ఆ వివరాల ప్రకారం గత సంవత్సరం డిసెంబర్‌నాటికి ఎన్.పి.ఏ.లు 121 బిలియన్ డాలర్లు ఉండగా ఈ సంవత్సరం జూన్‌నాటికి 138.5 బిలియన్ డాలర్లకు పెరిగినట్లు అంచనా వేయబడింది. ఇది 15 శాతం పెరుగుదలగా ఉంది. ఎన్.పి.ఏ.ల్లో 122 బిలియన్ డాలర్లు ప్రభుత్వరంగ బ్యాంక్‌లవి కాగా, ప్రైవేట్ బ్యాంక్‌ల వాటా 14 బిలియన్ డాలర్లు, విదేశీ బ్యాంక్‌లవి 2.3 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. దీన్ని గమనిస్తే ఎన్.పి.ఏల్లో 90 శాతంపైగా ప్రభుత్వ బ్యాంకుల్లోనే ఉన్న వాస్తవం బయటకు వచ్చింది.

90 రోజులకుపైగా ఎలాంటి చెల్లింపులు లేని నిరర్థక ఆస్తుల, పునరుద్ధరించిన ఆస్తుల ఖాతాల ప్రక్షాళనకు ఆర్.బి.ఐ ఆదేశించాక ఎన్.పి.ఏ. పెరుగుతున్నదని, లోగడ పునరుద్ధరించిన ఆస్తులు నిరర్థక ఆస్తుల జాబితాలోకి చేరుతున్నట్లు బ్యాంక్‌లు స్పష్టం చేశాయి.

బడా పరిశ్రమాధిపతులు నష్టాలపేరుతో బ్యాంక్‌లకు చెల్లించాల్సిన అప్పులు చెల్లించకపోవటం, వాటిని నిరర్థక ఆస్తులుగా బ్యాంక్‌లు ప్రకటించటం, తిరిగి పాలకులే, పరిశ్రమాధిపతులకు వడ్డీ రాయితీతో బ్యాంక్‌ల నుండి రుణాలు ఇవ్వటం బ్యాంకింగ్ వ్యవస్థ, రాజకీయ వ్యవస్థలు బడా పరిశ్రమాధిపతుల ప్రయోజనాలకు ప్రతినిధులుగా ఉన్న వాస్తవాన్ని వెల్లడిచేస్తోంది. ★

Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010